PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 231 | విజయవాడ, మంగళవారం 26 మార్చి 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 26 March 2024 | Rs

ఓ ముస్లిం ఇచ్చిన

'భారత్ మాతా కీ జై' నినాదం వదిలేసుకుంటారా?

- సంఘ పరివార్‌ను సూటిగా ప్రశ్నించిన పినరయి విజయన్

లోపలి పేజీలో..



చెన్నైలో టైటిల్ పోరు

- మే 26న ఐపిఎల్-17 ఫైనల్
- పూర్తి షెడ్యూల్ విడుదల చేసిన బిసిసిఐ

6

కెజిబివి కాంట్రాక్టు టీచర్లకు
కనీస వేతన స్కేలు

- అమలు చేయాలని హైకోర్టు తీర్పు
- కాంట్రాక్టు ఉద్యోగుల బదిలీకి గ్రీన్ సిగ్నల్

ప్రజాశక్తి-అమరావతి



కాంట్రాక్టు ఉద్యోగులందరికీ కనీస వేతన స్కేల్ వర్తింపజేసిన ప్రభుత్వం.. ఆ స్కేల్‌ను కెజిబివి కాంట్రాక్టు ఉద్యోగులకూ అమలు చేయాలని హైకోర్టు తీర్పు చెప్పింది. కనీస వేతన స్కేల్‌ను వారందరికీ 2022 జనవరి ఒక నుంచి వర్తింపజేయాలని, బకాయిలను 12 వారాల్లో చెల్లించాలంటూ జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ వి కృపాసాగర్‌తో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. ప్రభుత్వం కనీస వేతనాలు అమలు చేయాలని, బదిలీల జిఓను రద్దు చేయాలంటూ రాష్ట్రంలోని కస్తురిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో కాంట్రాక్టు టీచర్లు 2022లో దాఖలు చేసిన పిటిషన్‌లో బదిలీల వ్యవహారంలో ఉత్తర్వులకు సింగిల్ జడ్జి నిరాకరించారు. కనీస వేతనాలు, బకాయిలు చెల్లించాలని తీర్పు చెప్పారు. బదిలీలు చేయడానికి వీల్లేదంటూ, కాంట్రాక్టు టీచర్లు, సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయాలంటూ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వేర్వేరుగా అప్పీళ్లను దాఖలు చేశారు. బదిలీలు చేసే అధికారం ఉందని తేల్చిన డివిజన్ బెంచ్.. కనీస వేతన పేస్కేల్ అమలు-బకాయిల చెల్లింపులు చెల్లించాలని కూడా ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తీర్పు చెప్పింది. అలాగే కాంట్రాక్టు ఉద్యోగులను బదిలీ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని హైకోర్టు తీర్పు వెలువరించింది. కాంట్రాక్టు ఉద్యోగ నియామక ఒప్పందంలో బదిలీ అంశం ఉన్నప్పుడు ఆ మేరకు ప్రభుత్వం చేయొచ్చునని స్పష్టం చేసింది. కెజిబివి కాంట్రాక్టు టీచర్లను బదిలీ చేస్తూ 2022లో ప్రభుత్వం జారీ చేసిన జిఓ 108ను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను కొట్టివేసింది. ఆ జిఓను సమర్థిస్తూ తీర్పు వెలువరించింది.



ఎలక్టోరల్ బాండ్స్ రాష్ట్రంలో ఎవరి కెంత?

5



తక్షణమే కాల్పుల విరమణ

- మొదటి సారి తీర్మానం ఆమోదించిన ఐరాస భద్రతా మండలి
- ఓటింగ్‌కు అమెరికా గైర్హాజరు

ఐక్యరాజ్య సమితి : ఇజ్రాయిల్, హమాస్ మధ్య తక్షణమే కాల్పుల విరమణ జరగా లని కోరుతూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఓ తీర్మానం చేసింది. కాల్పుల విరమణకు సంబంధించి మండలి ఇటువంటి తీర్మానం ఆమోదించడం ఇదే మొదటిసారి. ఇంతకు ముందు కాల్పుల విరమణ తీర్మానాలను తెచ్చినప్పుడల్లా వీటో అధికారాన్ని ఉపయోగించి అడ్డుకున్న అమెరికా ఈసారి ఓటింగ్‌కు గైర్హాజరు కాగా, మండలిలోని మిగతా 14 దేశాలు తీర్మానానికి అనుకూలం గా ఓటు వేశాయి. భద్రతా మండలిలోని ఎన్నికైన పది దేశాలు కలసికట్టుగా ఈ తీర్మానాన్ని ప్రతిపా దించాయి. రంజాన్ మాసంలో రక్తపాతం సాగిస్తున్న ఇజ్రాయిల్ చర్యను అవి నిరసించా యి.కాల్పుల విరమణపై అస్పష్టమైన తీర్మానాన్ని అమెరికా గత వారం తీసుకొొచ్చిన ప్పుడు రష్యా, చైనా వీటో చేసిన సంగతి తెలిసిందే. గాజాకు తక్షణమే మానవతా సాయా న్ని విస్తరించాల్సిన ఆవశ్యకతను ఈ తీర్మానం నొక్కిచెప్పింది. అమెరికా గనుక ఈ తీర్మానాన్ని అడ్డుకోకపోతే వాషింగ్టన్‌కు పంపాల్సిన తన ప్రతినిధి బృందాన్ని నిలిపేస్తామని నెతన్యాహు హెచ్చరించారు. ఇప్పటివరకు గాజాపై రూపొందించిన మూడు ముసాయిదా తీర్మానాలను అమెరికా వీటో చేసింది.

పాతాళానికి భూగర్భజలం



ప్రకాశం, సత్యసాయి జిల్లాల్లో పరిస్థితి దారుణం
ఎన్నికల హడావిడిలో పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ఏడాది నెలకొన్న తీవ్ర వర్షాభావంతో రాష్ట్రంలో భూగర్భజలాలు రికార్డు స్థాయికి పడిపోయాయి. వర్షాభావ పరిస్థితులతో రాష్ట్రంలో ఎక్కడా వాగులు, వంకలు పారకపోవడం చెరువుల్లోకి పెద్దగా నీరు చేరకపోవడంతో భూగర్భజలమట్టాలపై తీవ్ర ప్రభావం చూపింది. బోరుబావుల కింద వున్న నీటిపథకాలు అన్నీ పడకేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు తీవ్రమవుతున్నాయి. అయితే, ఎన్నికల హడావిడిలో పడిపోయిన రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోవడం లేదు. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు అభ్యర్థుల ఎంపిక, ప్రచార పర్వాల్లో పడిపోగా, అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉంది. దీంతో ఆందోళన చేయడం తప్ప మరోమార్గం లేని స్థితి ప్రజానీకానికాని ఏర్పడుతోంది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఏడు జిల్లాలు మినహా 19 జిల్లాల్లో భూగర్భ జలాలు ప్రమాదకరం స్థితికి పడిపోయాయి. గత ఏడాదితో పోలిస్తే ఫిబ్రవరినెలలో 2.27 మీటర్ల దిగువకు నీటిమట్టాలు పడిపోయాయి. గత ఏడాది ఫిబ్రవరిలో 7.28 మీటర్లకు దిగువన నీటిమట్టం నమోదు కాగా ఈ ఏడాది 9.56 మీటర్లకు పడిపోయింది. కరువు ప్రాంతం అయిన రాయలసీమ జిల్లాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. గత ఏడాది ఫిబ్రవరిలో రాయలసీమ ప్రాంతంలో 6.79 మీటర్లలో భూగర్భ జలాలు లభ్యమైతే , ఈ ఏడాది ఏకంగా 11.04 మీటర్లుగా నమోదు అయ్యింది. అలాగే కోస్తాంధ్ర ప్రాంతాల్లోనూ మిగతా 2లో



ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల పంచాయతీ పరిధి ఐనముక్కులో రాస్తారోకో

తాగునీటి కోసం రాస్తారోకో

ప్రజాశక్తి- పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా)

తాగునీటి కోసం మహిళలు, గ్రామస్తులు రోడ్డెక్కారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల పంచాయతీ పరిధిలోని ఐనముక్కుల ఎస్‌సి కాలనీ వద్ద సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌సి కాలనీ వాసులు తాగునీటి కోసం చాలా రోజులుగా అవస్థలు పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా, ఫలితం లేకపోవడంతో ఆగ్రహించిన మహిళలు, గ్రామస్తులు కేజీ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి సీజన్ ప్రారంభం కావడంతో తాగునీటి సమస్య మరింత తీవ్ర రూపం దాల్చినట్లు తెలిపారు. గ్రామంలోని డీప్ బోర్లు మరమ్మతులకు గురయ్యాయన్నారు. కొత్త బోర్లు వేయాలని అధికారులను కోరినా పట్టించుకోలేదని వాపోయారు. ట్యాంకర్ల ద్వారా రోజు మార్చి రోజు నీరు సరఫరా చేస్తున్నారని, ఈ నీరు సరిపోక ఇబ్బందులు తప్పడం లేదని తెలిపారు. ప్రతి రోజూ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు గంటసేపు రాస్తారోకో చేయడంతో రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఎస్ఐ అంకమ్మరావు అక్కడకు చేరుకుని సర్ది చెప్పడంతో గ్రామస్తులు, మహిళలు రాస్తారోకో విరమించారు.

పింఛను 4 వేలు

- ఉద్యోగులకు పిఆర్‌సి, పంచాయతీలకు నిధులు
- యుద్ధానికి అందరూ సిద్ధం కావాలి : కుప్పంలో చంద్రబాబు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో



బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

తాము అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా ఒకటిన నాలుగు వేల రూపాయలు పింఛను ఇంటికే తీసుకొొచ్చి అందిస్తామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. లాయర్లకు, జర్నలిస్టులకు, మహిళలకు, టీచర్లకు, ఉద్యోగులకు సరసమైన ధరలకే ఇళ్ల స్థలాలిస్తామని తెలిపారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం ఆయన చిత్తూరు జిల్లా కుప్పం వచ్చారు. ఈ సందర్భంగా కుప్పంలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికలు వచ్చాయని, యుద్ధానికి అందరూ సిద్ధం కావాలని టిడిపి శ్రేణులను కోరారు. 40 రోజులు అలుపెరగకుండా కష్టపడితే విజయం మనదేనన్నారు. 'కుప్పంలో లక్ష మెజార్టీకి సిద్ధమా?' అంటూ కార్యకర్తలను, పార్టీ శ్రేణులను ఉత్సాహపర్చారు. ఉద్యోగులకు మెరుగైన పిఆర్‌సి ఇస్తామని, అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు నిధులు కేటాయించి పూర్వ వైభవం, ప్రజాపాలన తీసుకొస్తానని హామీ ఇచ్చారు. అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలంటే ఎన్‌డిఎతో పొత్తు తప్పనిసరని సమర్థించుకున్నారు. బిజెపితో పొత్తును ముస్లిం, మైనార్టీ సోదరులు వేరుగా భావించవద్దని, వారి ప్రయోజనాలను కాపాడతానని చెప్పుకొచ్చారు. పేదవారికి అన్నం పెట్టాలని అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తే, జగన్ వచ్చాక వాటిని ధ్వంసం చేశారన్నారు. జగన్ పది రూపాయలిచ్చి వంద రూపాయలు లాక్కుంటున్నారని, దీన్ని రాష్ట్ర ప్రజలు గమనించాలని కోరారు. వైసిపి నాయకులు భూ కబ్జాలకు పాల్పడడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతు న్నారని, అందుకు కడప జిల్లా ఒంటిమిట్ట పద్మశాలీ కుటుంబమే తాజా ఉదాహరణని పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌లో డ్రగ్స్, గంజాయి ప్రభుత్వం రాజ్యమేలుతోంది. మత్తుకు బానిసై యువత చెడ్డదారి పడుతోంది. జాతి నిర్వీర్యం అవుతోంది.' అని అన్నారు. వలంటీర్ వ్యవస్థకు తాము వ్యతిరేకం కాదని తెలిపారు. అయితే, మిగతా 2లో

త్రిపుర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో

'సేవ్ ది కానిస్టిట్యూషన్' ప్యానెల్ విజయం

- మితవాదులకు పరాజయం

లోపలి పేజీలో..

మాధవరం 'ఆత్మహత్యల'పై జ్యుడీషియల్ విచారణ

- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకుల డిమాండ్
- నేడు కలెక్టరేట్ వద్ద ఆందోళన

ఉపకులాలపై దృష్టి

- పోటాపోటీగా వైసిపి, టిడిపిల కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

మరికొద్ది రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కుల సమీకరణలకు అన్ని ప్రధాన పార్టీలు తెరతీస్తున్నాయి. దీనిలో భాగంగా ఉపకులాలపై దృష్టి సారిస్తున్నాయి. నియోజకవర్గాల వారీగా ఉపకులాల వారగా ఓటర్ల వివరాలను సేకరిస్తున్నాయి. టిడిపి,జనసేన, బిజెపి కూటమితో పాటు వైసిపి కూడా ఈ దిశలో పెద్ద ఎత్తున దృష్టిసారించింది. బిసిల ఓట్లు తమకే అని చెప్పుకునే తెలుగుదేశం పార్టీ స్థానింగా ఉన్న ఆ కులాల నాయకులను దీని కోసం వినియోగిస్తోంది. వారి ద్వారా నియోజకవర్గంలోని ఉపకులాల ఓటర్ల వివరాలను ఆ పార్టీ సేకరిస్తోంది. ఇటీవల నిర్వహించిన కులసర్వేతో పాటు, వాలంటీర్ల నుండి ఇప్పటికే అందిన సమాచారాన్ని వైసిపి ప్రధానంగా వినియోగిస్తోంది. ఈ సమాచారం ఆధారంగా స్థానిక నాయకులను, కార్యకర్తలను వారి వద్దకు పంపుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడిన కులాల వారు 29 శాతం ఉన్నారు. వీరిలో ఎక్కువగా ఎ, బి, డి వర్గాలకు చెందిన వారే 24 శాతం ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బిసిలకు సంబంధించి బిసి-ఎలో 7 శాతం, బిసి-బిలో 10 శాతం, బిసి-సిలో ఒక శాతం, బిసి-డిలో ఏడు శాతం, బిసి-ఇలో నాలుగు శాతం మంది జనాభా ఉన్నారు. వీటిల్లో బిసి-ఎలోనే ఎక్కువ ఉప కులాలు ఉన్నాయి. ఈ కేటగిరిలో మొత్తం 51 ఉపకులాలు ఉండడం గమనార్హం. అలాగే బిసి-డిలో 46 ఉప కులాలు, బిసి-బిలో 26 ఉప కులాలు ఉన్నాయి.

కీలకంగా కుల గణన

ఈ నేపథ్యంలో ఫిబ్రవరి నెలలో రాష్ట్ర వ్యాప్తంగా సాగిన కుల గణన కీలకంగా మారింది. ఉపకులాల వారీగా సేకరించిన వివరాలు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ వద్ద భద్రంగా ఉన్నాయి. ఈ వివరాల ఆధారంగానే వైసిపి నేతలు క్షేత్ర స్థాయిలో ఉప కులాల వారీగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. దీనికోసం ఆయా ఉప కులాల స్థానిక నేతలతో కూడా మంతనాలు చేస్తున్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లోని నియోజకవర్గ స్థాయి నేతలను పిలిపించి వారితో ఉప కులాల నేతలతో చర్చలు సాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

'మిమ్స్' పోరు ఉధృతం

- ర్యాలీ, రహదారి దిగ్బంధం

2

కాంగ్రెస్ ఆరో జాబితా విడుదల

న్యూఢిల్లీ : రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ ఆరో జాబితాను విడుదల చేసింది. ఇందులో ఐదు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. దీంతో ఇప్పటి వరకూ కాంగ్రెస్ మొత్తంగా 190 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. సోమవారం ఆరో జాబితాలో రాజస్థాన్‌లో నాలుగు, తమిళనాడులో ఒక స్థానానికి అభ్యర్థులను ప్రకటించింది. తమిళనాడులో ఉప ఎన్నిక జరగనున్న విలవంకొడ్ అసెంబ్లీ నియోజకవర్గానికి కూడా కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించింది. ఆరో జాబితా ప్రకారం రాజస్థాన్‌లో కోటా లోక్‌సభ స్థానం నుంచి ప్రహ్లాద్ గుంజల్‌ను కాంగ్రెస్ బరిలోకి దింపింది. బిజెపి మాజీ ఎమ్మెల్యే అయిన ప్రహ్లాద్ గుంజల్ ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ముఖ్యమంత్రి వసుంధరరాజే సన్నిహితుడు గుంజల్‌కు పేరుంది. అలాగే, అజ్మర్ నియోజకవర్గం నుంచి రామచంద్ర చౌదరీని, రాజ్‌సమండ్ నుంచి సుదర్శన్ రావత్‌ను, భిల్వారా నుంచి దామోదర్ గుర్జార్‌ను కాంగ్రెస్ పోటీకి దింపింది. తమిళనాడులోని తిరునెల్వేలి నుంచి సి రాబర్ట్ బ్రూస్‌ను పోటీకి దింపింది. విలవంకొడ్ అసెంబ్లీ స్థానం నుంచి థరహై కుత్‌బెర్త్ బరిలోకి దింపింది.

'అమరావతి' ఉద్యమానికి విరామం

- ఎన్నికల కోడ్‌తో నిలిపివేసిన జెఎసి నేతలు
- 1560 రోజుల కొనసాగిన ఉద్యమం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



ఉద్యమం చేస్తున్న రైతులు (ఫైల్ ఫోటో)

ఎన్నికల షెడ్యూలు వెలువడిన నేపథ్యంలో ప్రవర్తనా నియామవళి అమలులోకి రావడంతో అమరావతి రైతులు తమ ఉద్యమానికి తాత్కాలిక విరామం ప్రకటించారు. ఎన్నికల సంఘం ఆదేశాలు, పోలీసుల సూచన మేరకు తాత్కాలిక విరామం ప్రకటిస్తున్నట్టు సమన్వయ కమిటీ, అమరావతి రాజధాని ఐక్య కార్యాచరణ సమితి తెలిపింది. ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేసింది.

2019 డిసెంబరు 17న సిఎం జగన్ అసెంబ్లీలో మూడు రాజధానుల ప్రకటన అనంతరం రాజధాని గ్రామాల్లో పెద్ద ఎత్తున రైతులు నిరసనలు ప్రారంభమయ్యాయి. విరామం లేకుండా 1560 రోజులుగా ఎన్ని అవాంతరాలు, అణచివేతలు ఎదురైనా అప్రతిహతంగా అమరావతి ఉద్యమం కొనసాగింది. సార్వత్రిక ఎన్నికల నిబంధనలు అమలులోకి రావడంతో ఉద్యమాన్ని సోమవారం నుంచి నిలుపుదల చేశారు. 2020 డిసెంబరు 25 నుంచి కరోనా లాక్‌డౌన్ ప్రారంభం అయిన తరువాత కూడా ఇళ్ల వద్దనే రైతులు తమ నిరసనను కొనసాగించారు. 2021 అక్టోబరు వరకు ఉద్యమం కొంత మందగించినా ఆ తరువాత న్యాయస్థానం టు దేవస్థానం పేరుతో నేలపాడు నుంచి తిరుపతి వరకు పాదయాత్ర నిర్వహించారు. రెండోసారి అమరావతి నుంచి విశాఖ వరకు నిర్వహించిన పాదయాత్రకు అధికార పార్టీ శ్రేణులు అడ్డంకులు సృష్టించడంతో యాత్రను తూర్పు గోదావరి జిల్లా వరకు కొనసాగించారు. దాదాపు నాలుగు సంవత్సరాల నాలుగు నెలల పాటు ఉద్యమం కొనగించడం ఒక చరిత్రగా రైతు కార్యాచరణ సమితి తెలిపింది. కరోనా లాక్‌డౌన్‌లు, తుపానులు, విలయాలు, పోలీసుల దౌర్జన్యాలు, దాష్టీకాలు, కేసులు, అరెస్టులు, వేధింపులు, లాఠీల దెబ్బలు, తూటాల వంటి మాటలు ఇలా ఎన్ని ఆటంకాలు వచ్చినా అవిశ్రాంతంగా కొనసాగించి సుదీర్ఘ సమరశీల పోరాటంగా నిలిచిందని తెలిపింది. వైసిపి ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసినా ఉద్యమం కొనసాగిందని, ఇప్పటి వరకూ 2600 మందిపై 600కు పైగా కేసులు బనాయించారని, ఈ నాలుగేళ్లలో 250 మంది రైతులు చనిపోయారని తెలిపింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో
నేరం అంగీకరించిన నిందితులు

ప్రభాకర్‌రావు, కిషన్‌రావులకు లుకౌట్ నోటీసులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో



భుజంగరావు



తిరుపతన్న

ప్రణీత్‌రావు



బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలే లక్ష్యంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటూ ఆ సమయంలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబి)లో పనిచేసిన ఉన్నతాధికారులు అంగీకరించారు. ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకరరావు ఆదేశాల మేరకే ప్రతిపక్ష నాయకుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడించారు. టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావు, ఐ న్యూస్ మీడియా నిర్వాహకుడు శ్రవణ్‌రావు పాత్ర కూడా ఉందని పోలీసులు నిర్ధారించారు. ఇప్పటికే ప్రభాకరరావు, రాధాకిషన్‌రావు దేశం విడిచి వెళ్లినట్లు తెలియడంతో వారికి లుకౌట్ నోటీసులు జారీ చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో సహా పలువురు కాంగ్రెస్ నేతల ఫోన్లను తరచుగా హ్యాక్ చేస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయి. అయితే, ప్రభుత్వ పెద్దల ఒత్తిడి మేరకు పోలీసులు దానిపై దృష్టి పెట్టలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానంగా ఎస్ఐబి వ్యవహారాలపై దృష్టి పెట్టింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వెల్లడైన గత డిసెంబర్ మూడున ఎస్ఐబి డిఎస్‌పిగా ఉన్న ప్రణీత్‌రావు ఎస్ఐబి కార్యాలయంలో ఫోన్ హ్యాకింగ్‌కు సంబంధించిన డేటాను ధ్వంసం చేసి హార్డ్ డిస్క్‌లను మాయం చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో, ఆయనను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రణీత్ రావును అరెస్ట్ చేసి హైదరాబాద్ తీసుకొొచ్చి విచారించారు. ఆయన ఇచ్చిన వాంగ్మూలం మేరకు... ప్రణీత్‌రావుతో కలిసి ఎస్ఐబిలో పనిచేసిన అదనపు ఎస్‌పిలు భుజంగరావు, తిరుపతన్నలను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురు నిందితులను కలిపి విచారించేందుకు పోలీసులు మంగళవారం కోర్టులో కస్టడీ పిటిషన్ వేయనున్నారు. అయితే, చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న భుజంగరావు, తిరుపతన్న తాము ఫోన్ ట్యాపింగ్ చేశామని అంగీకరించారని పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. ప్రణీత్‌రావుతో కలిసి ఆధారాలు ధ్వంసం చేశామని వారు అంగీకరించినట్లు సమాచారం. వారిచ్చిన సమాచారం మేరకు నాగోలు మూసీ వంతెన కింద హార్డ్ డిస్క్‌ల భాగాలను ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఎఫ్ఎస్-ఎల్‌కు పంపించారు.

భావి భారత శాస్త్రవేత్తలుగా అభివృద్ధి కావాలి

- జనవిజ్ఞాన వేదిక


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థులు శాస్త్రీయ అవగాహనను పెంచుకోవడం ద్వారా ఉత్తమ శాస్త్రవేత్తలుగా అభివృద్ధికావాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఎం గేయానంద్, కుర్రా రామారావు ఆకాంక్షించారు. సోమవారం విజయవాడలో జన విజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సైన్స్ ప్రయోగాల వీడియో పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో కర్నూలు జిల్లా భాష్యం స్కూల్ విద్యార్థులు స్నేహిత, అమూల్య, ప్రణీతలు మొదటి బహుమతిని పొందగా శ్రీకాకుళం జిల్లా జి సిగడాం మండలం డి బోండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం చరణ్ తేజ ద్వితీయ బహుమతిని పొందారు. అలాగే పల్నాడు జిల్లా ఇప్పుడు మండలం బొగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎ చెన్నకేశవ తృతీయ బహుమతిని పొందారు. ఈ సందర్భంగా గేయానంద్, కుర్రా రామారావుతో పాటు జెవివి విద్యా విభాగం రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ మాట్లాడారు. విద్యార్థిని విద్యార్థులలో సజనాత్మకతను, హేతుబద్ధతను, శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించుకోవాలని కోరారు.అందుకే జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర స్థాయిలో సైన్స్ ప్రయోగాల పోటీలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో వందలాదిమంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని వినూత్నమైన ప్రయోగ వీడియోలు రూపొందించి సైన్స్ పట్ల తమ జిజ్ఞాసను ప్రదర్శించడం అభినందనీయమని తెలిపారు. జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక నాయకులు మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ నాణ్యమైన శాస్త్రీయ విద్యను అందించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఇందుకోసం ప్రయోగశాలలు, వనరులు సమకూర్చాలని అన్నారు. అలాగే ఉపాధ్యాయులు ప్రయోగాత్మక బోధన చేయడం ద్వారా సైన్స్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

30 నుంచి పవన్ ప్రచారం

- తొలి పర్యటన పిఠాపురమే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈ నెల 30 నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నారు. ఆయన పోటీ చేస్తున్న పిఠాపురం నియోకజవర్గం నుంచే ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. పార్టీ ముఖ్య నేతలతో సోమవారం జరిగిన సమావేశంలో ఎన్నికల ప్రచారంపై నిర్ణయం తీసుకున్నారు. పిఠాపురం కేంద్రంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రచారానికి వెళ్లాలని, అందుకు అనుగుణంగానే పర్యటన షెడ్యూల్ రూపొందించాలని నాయకులను ఆదేశించారు. మూడు విడతలుగా ప్రచారం ఉండాలని నిర్ణయించారు. ప్రతి విడతలో జనసేన పోటీ చేసే నియోజకవర్గాలకు వెళ్లేలా షెడ్యూల్ ఉండాలని చెప్పారు. తొలి మూడు రోజులు పిఠాపురంలో ఉండి పార్టీ నాయకులతో అంతర్గత సమావేశాలు నిర్వహించనున్నారు. కూటమి భాగస్వాములైన టిడిపి, బిజెపి నాయకులతోనూ సమావేశం కానున్నారు. ఉగాది వేడుకలు పిఠాపురంలో నిర్వహించనున్నారు.

పురందేశ్వరితో మంద కృష్ణ మాదిగ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరితో ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌డిఎ అభ్యర్థుల గెలుపునకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌సి వర్గీకరణకు బిజెపి కట్టుబడి ఉందని పురందేశ్వరి పేర్కొన్నారు.

'మిమ్స్' పోరు ఉధృతం

- ర్యాలీ, రహదారి దిగ్బంధం



రామతీర్థం కూడలిలో రాస్తారోకో చేస్తున్న మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు, రాజకీయ నాయకులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల (విజయనగరం జిల్లా)

తమ సమస్యల పరిష్కారం కోసం మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు పోరాటాన్ని ఉధృతం చేశారు. మిమ్స్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా నెల్లిమర్లలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామతీర్థం కూడలిలో రాస్తారోకో చేశారు. ముందుగా మొయిద జంక్షన్ నుంచి రామతీర్థం జంక్షన్ వరకు ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రహదారిని దిగ్బంధించి ధర్నా చేశారు. చంద్రంపేట, కొండగుంపాం, గరికిపేటకు చెందిన వైసిపి నాయకులు, టిడిపి నాయకులు మద్దతు తెలిపి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ.. కార్మిక చట్టాలు ఉల్లంఘిస్తున్న మిమ్స్ యాజమాన్యానికి ప్రభుత్వం వత్తాసు పలకడం భావ్యం కాదన్నారు. మిమ్స్ యాజమాన్యం, ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆందోళన నేపథ్యంలో సిఐటియు నాయకులు జగన్మోహన్‌ను నెల్లిమర్ల పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం విడుదల చేశారు.ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా లా అండ్ ఆర్డర్ సమస్యకు కారణమైన యాజమాన్యాన్ని వదిలేసి సిఐటియు నాయకులను అరెస్ట్ చేయడాన్ని ఆయన ఖండించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కిల్లంపల్లి రామారావు, ఫేకర్ యూనియన్ నాయకులు అంబళ్ల గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల పోరాటానికి వైసిపి, టిడిపి నాయకులు మద్దతు తెలిపారు.

కొంప మునుగుతుందా?

- బిజెపితో దోస్తీపై టిడిపిలో ఆందోళన
- ఆ 29 అసెంబ్లీ స్థానాల్లో ఓట్లు కష్టమే..!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి నేతల్లో కొత్త భయం నెలకొంది. ఎన్నికల నిర్వహణ సులువుగా చేసుకోవచ్చునని ఆ పార్టీ అధిష్టానం భావించి బిజెపితో పొత్తు కుదుర్చుకుంది. అయితే ఇప్పుడు ఆ పార్టీ వల్ల తమ కొంప మునుగుతుందేమోనని టిడిపి నేతలు భయపడుతున్నారు. కమలం వల్ల తమకు ఓట్లు పడతాయా? లేదా? అనే ఆందోళనలో ఉన్నారు. కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రానికి చేసింది శూన్యమని టిడిపి నేతలు భావిస్తున్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు నెరవేర్చకపోవడం, ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం, రైల్వేజోన్ ఊసేత్తకపోవడంతోపాటు విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకోవడంతో రాష్ట్ర ప్రజలు బిజెపిపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని టిడిపి నేతలు ఆందోళనలో చెందుతున్నారు. ఇటీవల చిలకలూరిపేటలో జరిగిన సభలో ఈ అంశాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. దీంతో టిడిపి నేతలతోపాటు రాష్ట్ర ప్రజలూ అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని ఒక్క మాటా అనకపోవడంతో టిడిపి కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు. దీంతో జగన్‌కు మోడీ పరోక్షంగా మద్దతు ఇస్తున్నారనే భావన టిడిపిలో నెలకొంది. అదేవిధంగా మతోన్మాద పార్టీ అనే ముద్ర ఉండటమే కాకుండా ముస్లిములకు వ్యతిరేకంగా ఇటీవల సిఎఎ బిల్లును కూడా అమల్లోకి తీసుకొచ్చింది. ముఖ్యంగా ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు, మేధావులు, తటస్థ వర్గాల ప్రజలు బిజెపిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని చెబుతున్నారు. అయితే బిజెపి పోటీ చేయనున్న 6 లోక్‌సభ స్థానాల పరిధిలోని శాసనసభ స్థానాల్లో టిడిపి అభ్యర్థులు కలిసి ప్రచారం చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బిజెపిపై ఉన్న కోపంతో తమ పార్టీకి ఓటు వేస్తారా? లేరా? అనే ఆందోళన టిడిపి అభ్యర్థుల్లో నెలకొంది. తిరుపతి, రాజంపేట, నరసాపురం, రాజమండ్రి, అనకాపల్లి, అరకు లోక్‌సభ స్థానాల్లో బిజెపి పోటీ చేయనుంది. ఈ పరిధిలో టిడిపి నుంచి 29 మంది అభ్యర్థులు అసెంబ్లీ బరిలో ఉన్నారు. తిరుపతి లోక్‌సభ పరిధిలో సర్వేపల్లి, సూళ్లురుపేట, గూడూరు, శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి నియోజకవర్గాలు, రాజంపేట పరిధిలో రాయచోటి, తంబలపల్లె, పీలేరు, పుంగనూరు, మదనపల్లి నియోజకవర్గాలు, అరకు పరిధిలో కురుపాం, పార్వతీపురం, సాలూరు, అరకు వ్యాలీ, రంపచోడవరం నియోజకవర్గాలు, అనకాపల్లి పరిధిలోని పాయకరావుపేట, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల స్థానాలు, రాజమండ్రి పరిధిలో రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్, అనపర్తి, గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాలు, నరసాపురం కింద ఆచంట, పాలకొల్లు, ఉండి, తణుకు స్థానాలు ఉన్నాయి. వీటిల్లో మరలా 8 ఎస్‌సి, 5 ఎస్‌టి నియోజకవర్గాలు బిజెపి పోటీ చేస్తున్న లోక్‌సభ స్థానాల పరిధిలో ఉన్నాయి. దీంతో ఈ నియోజకవర్గాల్లోని టిడిపి అభ్యర్థుల్లో ఈ ఆందోళన మరికొంత నెలకొంది.

సలహాదారుగా ఉండి రాజకీయాలు మాట్లాడుతారా?

- సజ్జలపై ఎన్నికల కమిషన్‌కు టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ సలహాదారుగా సజ్జల రామకృష్ణారెడ్డిపై ఎన్నికల సంఘానికి టిడిపి ఫిర్యాదు చేసింది. ప్రభుత్వ పదవిలో ఉంటూ రాజకీయ నాయకుడిలా మాట్లాడుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి సోమవారం లేఖ రాశారు. సలహాదారులా కాకుండా వైసిపి కార్యకర్తలా ప్రతిపక్షాలపై విషం చిమ్ముతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ మార్చి 18, 22 తేదీల్లో విలేకరుల సమావేశం నిర్వహించి ప్రతిపక్షాలపై బహిరంగ ఆరోపణలు చేశారని అన్నారు. అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సలహాదారు పదవి నుంచి తొలగించాలని కోరారు.

క్షమాపణ యాత్రగా మార్చాలి : వర్ల రామయ్య

ఐదేళ్లుగా గడప దాటి బయటకు రాని జగన్‌కు ఇప్పుడు బస్సు యాత్ర పేరుతో ప్రజల్లోకి వెళ్లే అర్హత లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. బస్సు యాత్రను క్షమాపణ యాత్రగా మార్చాలని అన్నారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాదయాత్ర, ఎన్నికల మేనిఫెస్టోలో దాదాపు 730కు పైగా హామీలిచ్చారని, వీటిల్లో ఎన్ని నెరవేర్చారో సమాధానం చెప్పాలన్నారు. నారా లోకేష్ కాన్వాయ్‌ను టార్గెట్ చేసి రెండు రోజుల్లో నాలుగు సార్లు తనిఖీ చేయడం దుర్మార్గమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ షరీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అవాస్తవాలతో జగన్ డ్రగ్ మాఫియా ప్రజలను పక్కదారి పట్టించాలని చూస్తున్నారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ వారితో పత్రికా ప్రకటనలతో పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. కీలకమైన ఫైళ్లు, హార్డ్ డిస్కులు, చెక్‌బుక్‌లతో దొరికిన సంధ్యా కంపెనీ బస్సును పోలీసులు సిబిఐకి అప్పగించకుండా తిరిగి కంపెనీకి ఎందుకు అప్పగించారని ప్రశ్నించారు.

మాధవరం 'ఆత్మహత్యల'పై జ్యుడీషియల్ విచారణ

- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకుల డిమాండ్
- నేడు కలెక్టరేట్ వద్ద ఆందోళన



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్/ఒంటిమిట్ట

వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చెందిన పాల సుబ్బారావు, ఆయన భార్య పద్మావతి, కూతురు వినయ ఆత్మహత్యకు కారకులైన రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విచారణ జరిపి నిందితులను శిక్షించాలని, కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, పెద్ద కూతురు లక్ష్మిప్రసన్నకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ కేసుపై జ్యుడీషియల్ విచారణ జరపాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ. పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని నిర్ణయించామని లోకేష్ చెప్పారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సిపిఐ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, టిడిపి సీనియర్ నాయకులు జి.లక్ష్మిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎస్.ఎ.సత్తార్, ఆప్ జిల్లా నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, లోక్‌సత్తా పార్టీ నాయకులు కష్ణ, సిఆర్‌వి ప్రసాద్ తదితరులు మాట్లాడారు. మృతుడి తండ్రి పాల చలపతి...సోమశిల ప్రాజెక్టు నిర్మాణం కోసం అట్లూరు మండలంలో భూములు, ఇల్లు త్యాగం చేసి, ఒంటిమిట్ట మండలంలోని మాధవరం గ్రామంలో నివాసం ఉంటూ, ఒంటిమిట్ట గ్రామ పొలంలో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసుకునేవారని వివరించారు. రెవెన్యూ రికార్డుల్లో కూడా భూమిని నమోదు చేయించారని తెలిపారు. కరోనా సమయంలో ఆయన చనిపోయారన్నారు. రెండో కుమారుడైన సుబ్బారావు తన ఇద్దరూ కుమార్తెల చదువు, తమ్ముడి వివాహం, ఆర్థిక సమస్యలు, రుణదాతల ఒత్తిడి తాళలేక తండ్రి ద్వారా సంక్రమించిన పొలాన్ని విక్రయించి అప్పులు తీర్చాలని అనుకున్నారని చెప్పారు. అప్పులు, వ్యక్తిగత కారణాలతో సుబ్బారావు కుటుంబం చనిపోయినట్లు డిఎస్‌పి షరీఫ్ ప్రకటించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. మంగళవారం వైఎస్ఆర్ జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ఆందోళనలో పాల్గొనాలని కోరారు.

రూ. పది లక్షలు ఎక్స్‌గ్రేషియా : లోకేష్

సుబ్బారావు కుమార్తె లక్ష్మి ప్రసన్నను ఫోన్‌లో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ఓదార్చి తాము ఉన్నామని భరోసా ఇచ్చారు. టిడిపి తరుపున బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు.

సుబ్బారావు కుటుంబం రోడ్డున పడడానికి వైసిపి ప్రభుత్వమే కారణమని టిడిపి నాయకులు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి : కర్నూలు ఎంపి

పాల సుబ్బారావు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కర్నూలు పార్లమెంట్ సభ్యులు సింగరి సంజీవ్‌కుమార్ డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాన్ని కొత్తమాధవరంలో ఆయన పరామర్శించారు. ఇక్కడ పెత్తందారి వ్యవస్థ పేదల రక్తాన్నీ అన్నంలో కలుపుకొని తింటుందని విమర్శించారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో టిడిపి నాయకుడు దారుణ హత్య

- రాజకీయ కక్షతోనే ఘాతుకం : అచ్చెన్నాయుడు, లోకేష్ ఆరోపణ
- వ్యక్తిగత కారణాల వల్లే : డిఎస్‌పి

ప్రజాశక్తి- నల్లమాడ, పుట్టపర్తి అర్బన్, అమరావతి బ్యూరో



హత్యకు గురైన దుద్దకుంట అమర్‌నాథ్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

శ్రీ సత్యసాయి జిల్లా పట్టపర్తి నియోజకవర్గం నల్లమాడ మండలం కటాలపల్లి గ్రామంలో టిడిపి నాయకుడు ఆదివారం అర్ధరాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. ఎన్నికల వేళ ఈ ఘటనతో ఒక్కసారిగా ఆ ప్రాంత ప్రజలు ఉలిక్కిపడ్డారు. రాజకీయ కక్షతోనే వైసిపి వారు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని టిడిపి ఆరోపించింది. వ్యక్తిగత కారణాల వల్లే హత్య జరిగినట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని డిఎస్‌పి తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం... కుటాలపల్లి గ్రామానికి చెందిన దద్దుకుంట అమర్‌నాథ్‌రెడ్డి (40) గతంలో వైసిపిలో ఉండేవారు. ఆరు నెలల క్రితం టిడిపిలో చేరారు. అప్పటి నుంచి టిడిపి నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ క్రియాశీలకంగా పాల్గొనేవారు. ఆదివారం రాత్రి ఆయన గ్రామంలోని తన మామిడి తోటలో నిద్రించారు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో వేట కొడవలితో నరికి ఆయనను హత్య చేశారు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన రైతులు రక్తపు మడుగులో ఉన్న అమర్‌నాథ్‌రెడ్డి మృతదేహాన్ని గుర్తించి ఆయన కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలియజేశారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కటాలపల్లి గ్రామానికి వచ్చి అమర్నాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ హత్యపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ హత్య పట్ల టిడిపి నాయకులు మైలే శంకర్, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, మాజీ ఎంపిపి బ్రహ్మానందరెడ్డి, ప్రసాద్ రెడ్డి, కులశేఖర్ నాయుడు తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఓటమి భయంతో వైసిపి వారే ఈ ఘాతుకానికి పాల్పడ్డారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు వేరు ప్రకటనల్లో ఆరోపించారు. ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతి భద్రలు క్షీణించాయని, ప్రతిపక్ష నాయకులపై అరాచకాలు పెరిగిపోయాయని విమర్శించారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు.

రాజకీయ కారణాలు లేవు : డిఎస్‌పి

మృతదేహాన్ని, హత్య జరిగిన స్థలాన్ని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్‌పి మాధవరెడ్డి, డిఎస్‌పి వాసుదేవన్ పరిశీలించారు. అమర్‌నాథ్‌రెడ్డిని వ్యక్తిగత కారణాల వల్లే గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని, ఈ హత్యకు ఎటువంటి రాజకీయ కోణమూ లేదని డిఎస్‌పి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హత్య కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపామని, నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

గ్రామంలో టెన్షన్ వాతావరణం

ప్రశాంతంగా ఉండే కటాలపల్లి గ్రామంలో గతంలో ఎప్పుడూ హత్యలు జరగలేదు. ఎన్నికల సమీపిస్తున్న సమయంలో టిడిపి నాయకుడు దారుణ హత్యకు గురవ్వడంతో గ్రామంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. హత్య విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో కటాలపల్లి గ్రామానికి చేరుకున్నారు. అమర్‌నాథ్‌రెడ్డికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రాష్ట్రంలో అక్రమ నగదు పట్టివేత

- మద్యం స్వాధీనం.. ఐదుగురు అరెస్టు
- పోలీసుల అదుపులో బంగారు ఆభరణాలు వాహనం

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఎక్కడికక్కడ వాహనాలను అధికారులు తనిఖీలు చేశారు. అక్రమ నగదు, మద్యం, బంగారం స్వాధీనం చేసుకున్నారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలంలోని అలికాం-బత్తిలి ప్రధాన రహదారి అమృత లింగానగరం వద్ద ఓ కారులో రూ. రెండు లక్షల నగదు గుర్తించామని నగదును స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశామని ఎస్ఐ బి నిహార్ తెలిపారు. అన్నమయ్య జిల్లా బి కొత్తకోట అంగళ్లులో ఓ కారులో రూ.1.20 లక్షల నగదు పట్టుకున్నారు.

తనిఖీలలో బంగారం అభరణాలు, వజ్రాలు.. పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు వద్ద బంగారు నగలను తీసుకెళ్తున్న ఓ వాహనాన్ని అధికారులు పట్టుకున్నారు. ఇందులో ఓ ప్రముఖ బంగారు షాపునకు చెందిన రూ.15 కోట్ల విలువజేసే బంగారు ఆభరణాలు, వజ్రాలు ఉన్నట్లు తెలుస్తోంది. పూర్తి స్థాయిలో పత్రాలను పరిశీలించిన అనంతరమే వాహనాన్ని విడిచి పెడతామని అధికారులు తెలిపారు. బంగారు నగలు ఉన్న వాహనానికి సాయుధ బలగాలతో భద్రత కల్పించారు.

మద్యం స్వాధీనం

అనంతపురం జిల్లా రాప్తాడులో కర్ణాటక మద్యాన్ని సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం పేరూరు గ్రామానికి చెందిన రాకేష్, గుడుసాల మనోహర్, జి మహేష్‌లు కర్ణాటకలోని ఎగువపల్లి నుంచి మద్యాన్ని కొనుగోలు చేసి 13 బాక్సులు (1248) టెట్రా ప్యాకెట్లను బొలెరోలో రాప్తాడు మండలం పాలచెర్లకు అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు.

అనంతపురం జిల్లా కేంద్రం శిల్ప లేపాక్షినగర్‌లో ఆర్మీ క్యాంటీన్ నుంచి మద్యాన్ని తీసుకుని వచ్చి అక్రమంగా విక్రయిస్తున్న మాజీ బిఎస్‌ఎఫ్ జవాన్ హనుమంతరెడ్డిని అరెస్టు చేశారు. ఆయన వద్ద నుంచి రూ.5.50 లక్షల విలువజేసే 303 (750ఎంఎల్) మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతపురంలోని హమాలీకాలనీలో మాజీ సైనికోద్యోగి భరత్ రెడ్డి నుంచి 39 బాటిళ్ల ఫారిన్, ఆర్మీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలం వజ్జవారి కండ్రిగ గ్రామానికి సమీపంలో అక్రమంగా కారులో తరలిస్తున్న రూ. లక్ష విలువ చేసే 60 కర్ణాటక మద్యం బాటిల్స్ పట్టుకున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మేడే సందర్భంగా రచనల పోటీ

- పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ :

మేడే సందర్భాన్ని పురస్కరించుకొని వివిధ సాహిత్య ప్రక్రియల్లో రచనల పోటీ నిర్వహిస్తున్నట్టు జాషువా సాంస్కృతిక వేదిక తెలిపింది. ఈ మేరకు సోమవారం విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో సంస్థ బాధ్యులు పోస్టరును విడుదల చేశారు. అభివృద్ధిలో అసమానతలు, దోపిడీ, వివక్ష, సామాజిక సంక్షోభం తదితర అంశాలను ఇతివృత్తంగా తీసుకొని రచయితలు తమ రచనలు పంపవచ్చు. కథలు, కవితలు, పాటలు, వ్యాసాల ప్రక్రియల్లో ఈ పోటీ ఉంటుంది. ఒక్కో విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.ఐదు వేలు, రూ.మూడు వేలు, రూ.రెండు వేలు చొప్పున ఉంటాయి. ప్రతి విభాగంలోనూ రూ.వెయ్యి చొప్పున రెండు ప్రోత్సాహక బహుమతులూ ఉంటాయి. ఆ నెలాఖరుకల్లా రచనల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి, మే నెల ఐదున (ఆదివారం) విజయవాడలో జరిగే సభలో విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుంది. ఒకటికి మించి రచనలు పంపకూడదు. కథలు, వ్యాసాలూ ఎ4 సైజులో 4, 5 పేజీల వరకూ ఉండొచ్చు. కవిత 30 పంక్తులకు, పాట ఒక పల్లవి, 4 చరణాలు ఉండాలి. తెలుగువారు ఏ ప్రాంతంవారైనా పాల్గొనవొచ్చు. రచనలు పంపాల్సిన మెయిల్ ఐడి : sramikasambaralu24@gmail.com. రచనలు చేరటానికి చివరి తేదీ ఏప్రిల్ 20వ తేదీ. ఈ సమావేశంలో సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు వరప్రసాద్, శాంతిశ్రీ, ఉషారాణి, సాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ, అరసం కార్యదర్శి పరుచూరి అజయ్, కవి, రచయిత గడ్డం విజయరావు, కె లక్ష్మయ్య, జాషువా సాంస్కృతిక వేదిక బాధ్యులు గుండు నారాయణరావు పాల్గొన్నారు.

బేరింగ్ పాడవ్వడం వల్లే వైబ్రేషన్స్

- సాంకేతిక నిపుణుల సూచనలతో మార్పు చేస్తాం : ప్రద్యుమ్న

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరి నదిపై నిర్మించిన గామన్ బ్రిడ్జి 56-57 మధ్య స్పాన్ వద్ద బేరింగ్ పాడవ్వడం వల్ల వైబ్రేషన్స్ వచ్చాయని, సాంకేతిక నిపుణుల సూచనల మేరకు వాటిని మార్పు చేస్తామని రాష్ట్ర రవాణా, రోడ్లు భవనాల ముఖ్య కార్యదర్శి పిఎస్.ప్రద్యుమ్న తెలిపారు. సోమవారం సాయంత్రం సాంకేతిక నిపుణుల బృందంతో కలిసి ఆయన గామన్ బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ప్రద్యుమ్న మాట్లాడుతూ.. సాంకేతిక పరమైన లోపాన్ని బ్రిడ్జి నిర్వహణ సంస్థ గుర్తించిందన్నారు. బేరింగ్‌లు దెబ్బతినడం వల్ల వైబ్రేషన్స్ పెరిగినట్టు గుర్తించారని తెలిపారు. వంతెన భద్రతకు ఎటువంటి ఇబ్బంది లేదనీ స్పష్టం చేశారు. బేరింగ్ అందుబాటులో ఉంటే నాలుగైదు రోజుల్లోనే అమరుస్తారని, లేకుంటే ఈ వంతెనకు అనుగుణంగా బేరింగ్‌ను తయారు చేయాల్సి ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో వైబ్రేషన్స్ వస్తున్న ప్రాంతాన్ని పరిశీలించామని తెలిపారు. కలెక్టర్ కె.మాధవీలత, ఎస్‌పి పి.జగదీష్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్.శ్రీనివాసరెడ్డి,ఆర్ అండ్ బి ఎస్ఇ తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి జడ్‌పిటిసి గోకుల్ రాజీనామా

- వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్, అమరావతిబ్యూరో



గోకుల్ కృష్ణారెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న షర్మిల

నంద్యాల జిల్లా నంద్యాల జడ్‌పిటిసి సభ్యులు గోపవరం గోకుల్ కృష్ణా రెడ్డి వైసిపికి సోమవారం రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్ లోటస్ పాండ్‌లో పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా అహ్వానించారు. నంద్యాల వైసిపి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పని తీరు నచ్చక, నంద్యాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని భావించి ఈ పార్టీలో చేరినట్లు గోకుల్ తెలిపారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆయన బరిలో నిలుస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు చెప్తున్నారు.

కాంగ్రెస్‌లో పెరుగుతున్న చేరికలు

పిసిసి చీఫ్‌గా వైఎస్ షర్మిల బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు ఊపందుకున్నాయి. . వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ, ఎన్‌డిఎ కూటమి తరపున సీటు ఆశించి దక్కని వారిలో కొందరు కాంగ్రెస్‌వైపు చూస్తున్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్, చింతలపూడి ఎమ్మెల్యే ఎలిజా, మరికొందరు ఈ కోవలోనే కాంగ్రెస్ పార్టీలో చేరారు. సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే ధార సాంబయ్య కుమార్తె ధార పద్మజ, పోలవరం నియోజకవర్గానికి చెందిన వైసిపి కీలక మహిళా నేత దువ్వెల సృజన, నంద్యాల జెడ్‌పిటిసి గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే కొడుమూరు మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళికృష్ణ, శ్రీకాళహస్తి మాజీ ఛైర్మన్ పొతగుంట గురవయ్య నాయుడు తనయుడు డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడు, మాజీ పిసిసి చీఫ్ మజ్జి తులసిదాస్ తనయుడు మజ్జి త్రినాధ్ బాబు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితోపాటు అధికార పార్టీకి చెందిన మరి కొంత మంది ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలిసింది. వీరంతా కూడా ఆయా నియోజకవర్గాల నుంచి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికల బరిలో నిలిచే అవకాశాలు ఉన్నాయి.

పింఛను 4 వేలు

(మొదటి పేజీ తరువాయి)

వలంటీర్లు వైసిపి కార్యకర్తల్లా వ్యవహరిస్తే మాత్రం చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వలంటీర్లలోనూ బాగా చదువుకున్న వారు ఉన్నారని, తాము అధికారంలోకి వస్తే అటువంటి వారికి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇచ్చి రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు జీతం వచ్చేలా చూస్తామన్నారు. వేదికపై చిత్తూరు పార్లమెంట్ ఎంపి అభ్యర్థి దుగ్గిమళ్ల ప్రసాదరావు, కుప్పం ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పిఎస్ మునిరత్నం, గౌనివారి శ్రీనివాసులు పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ప్రత్యేక విమానంలో వచ్చి, రోడ్డు మార్గం ద్వారా కుప్పంలోని టిడిపి కార్యాలయానికి ఉదయం 11 గంటలకు చంద్రబాబు చేరుకున్నారు. కుప్పం, శాంతిపురం, గుడిపల్లి, రామకుప్పం ముఖ్య కార్యకర్తలతో ఆయన అంతర్గత సమావేశం, మహిళలతో మాటామంతీ నిర్వహించారు.

పాతాళానికి భూగర్భజలం

(మొదటి పేజీ తరువాయి)

భూగర్భజలాల పరిస్థితి నిరాశజనకంగా మారింది. గత ఏడాది 8.92 మీటర్లు వుంటే ఈ ఏడాది ఏకంగా 12.66 మీటర్లకు పడిపోయింది.

జిల్లాల వారిగా పరిశీలిస్తే ప్రకాశం జిల్లాలో ఎక్కువగా భూగర్భజలాలు పడిపోయాయి. గత ఏడాది ఫిబ్రవరిలో 10.62 మీటర్లు నమోదవుతే ఈ ఏడాది 18.86 మీటర్ల దిగువకు చేరాయి,. ప్రకాశం జిల్లాలో సగటు భూగర్భజల లభ్యత గత ఏడాదితో పోలిస్తే 8.24 మీటర్లకు పడిపోయింది. అలాగే సత్యసాయి జిల్లాలో గత ఏడాదికంటే 5.42 మీటర్ల దిగువకు నీటిమట్టం పడిపోయింది. రాష్ట్రంలోని అనంతపురం, నంద్యాల, పల్నాడు, అన్నమయ్య, కర్నూలు జిల్లాల్లో భూగర్భజలాల మట్టం గణనీయంగా పడిపోయింది. రాష్ట్రంలో అన్ని ప్రధాన ప్రాజెక్టుల్లో నీటినిల్వ సామర్థ్యం 865.64 టిఎంసీలుకాగా గత ఏడాది 391.7టిఎంసీలు వుంటే ఈ ఏడాది ప్రాజెక్టుల్లో నీటిమట్టాలన్నీ అడుగంటిపోయి కేవలం 229 టిఎంసీలు మాత్రమే వున్నాయి. అలాగే మీడియం ప్రాజెక్టుల సామర్థ్యం 115 టిఎంసీలు కాగా కేవలం 38 టిఎంసీలు మాత్రమే అందుబాటులో వుంది. నీటిలభ్యత ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో వేసవిలో తాగునీటి ఎద్దడిని అధిగమించడం అధికారులకు సవాల్‌గా మారనుంది.నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించే జూన్, జూలైదాకా నీటి ఎద్దడిని ఎలా అధిగమిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

చేనేత కుటుంబం ఆత్మహత్యపై సమగ్ర విచారణ

- అనంతపురంలో గర్భిణి ఆకలి చావు బాధ్యత ప్రభుత్వానిదే
- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తనది సంక్షేమ రాజ్యమని ప్రకటించుకుంటూ నవరత్నాల పేరుతో మోసం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు చేనేత కుటుంబ ఆత్మహత్య, అనంతపురం కలెక్టరేట్ వద్ద జరిగిన దళిత గర్భిణి ఆకలి చావు సాక్షి భూతాలుగా ఉన్నాయని సిపిఎం రాష్ట్ర కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కడప జిల్లా కొత్త మాధవరం చేనేత కుటుంబం 'ఆత్మహత్య'పై సమగ్ర విచారణ జరిపించాలని, ఆకలి చావుతో మరణించిన గర్భిణి పిల్లల బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆకలితో గర్భిణి మరణించడం అందరి హృదయాలను కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి ఎటువంటి సంక్షేమ పథకాలు అందకపోవడం శోచనీయమని తెలిపారు. అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మరణానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. 77 ఏళ్ల స్వాతంత్ర్యం అనంతరం కూడా ఆకలి చావులు సంభవించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాన్ని ఎత్తిచూపుతోందని అన్నారు. ఆకలి చావుతో మరణించిన ఆమె పిల్లల బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్పించెదెవరో తేల్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రెవెన్యూ విభాగాల్లో అవినీతి ఎంత హెచ్చుస్థాయిలో ఉందో దీనిని బట్టి అర్థమవుతుందని, వైసిపి నేతల భూ దాహానికి తోడు అధికారుల అలసత్వానికి నిండు కుటుంబం బలైపోయిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని విమర్శించారు. ఎటువంటి అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారులకే పథకాలు అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో అవినీతి తారాస్థాయిలో ఉందని తెలిపారు. నియోజకవర్గ వైసిపి నేత అనుచరులు సుమారు 600 ఎకరాలకుపైగా రెవెన్యూ రికార్డుల్లో పేర్లు తొలగించి అనర్హుల పేర్లను ఎక్కించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో చోటుచేసుకున్న వైసిపి నాయకుల దురాగతాలకు సర్కారే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి ఆత్మహత్యకు కారకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలు చెల్లించి, వారి భూమిని వారికి అప్పగించాలని కోరారు.

'ఆకలి చావు'పై స్పందించిన అధికారులు

- పిల్లలను బాలసదనంలో చేర్చేందుకు చర్యలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం కలెక్టరేట్ ఎదుట ఆకలితో ఓ గర్భిణి మరణించిన వార్తపై అధికారులు స్పందించారు. సోమవారం సాయంత్రం బాధిత కుటుంబం వద్దకు ఐసిడిఎస్ ప్రాజెక్టు అఫీసరు చంద్రకళ వచ్చారు. కలెక్టరేట్ ఎదుట ఉన్న విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం ఎదుట ఉన్న మృతిరాలి భర్తతో ఆమె మాట్లాడారు. అంజలి ముగ్గురు పిల్లలను హాస్టల్‌లో చేర్చి మంచి విద్యను అందించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అఖిలను వెంటనే బాలసదనంకు తీసుకెళ్తామని, ఇద్దరు మగపిల్లలను ప్రభుత్వ హాస్టల్‌లో చేర్పిస్తామన్నారు. మంగళవారం వారిని తీసుకెళ్లే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మృతిరాలి భర్త రాజు ఎప్పటిలాగానే మద్యం తాగి పడిపోగా, పిల్లలు అఖిల, చరణ్ , సాయి కు నానమ్మ భిక్షాటన చేసి తీసుకొచ్చినదే వారికి ఆహారమైంది. అఖిల ఆరవ తరగతి వరకు చదువుకుని మధ్యలో ఆపేశారు. ఇద్దరు బాలురులు బడి మెట్లు ఎక్కిన దాఖలాలు లేవు. ఈ పిల్లలకు ఇప్పటి వరకు ఆధార్‌కార్డు లేకపోవడం గమనార్హం.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి : ఐద్వా

అంజలి మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి ఓ ప్రకటన విడుదల చేశారు. మద్యానికి బానిసైన భర్త కుటుంబాన్ని పట్టించుకోకపోవడం, ఆ కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు అందకపోవడం ఆకలితో అలమటించి అంజలి మరణించారని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని, ఆచరణలో అమలు కావడం లేదనే దానికి ఈ ఘటన ఒక ఉదాహరణనని పేర్కొన్నారు. కలెక్టరేట్ ఎదురుగానే ఇల్లు కూడా లేకుండా జీవిస్తున్న అంజలి కుటుంబం.. అధికారులకు కనిపించలేదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి ఆ కుటుంబానికి ఆశ్రయం కల్పించాలని, పిల్లల బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంజలి మృతిపట్ల ఐద్వా సంతాపం ప్రకటించింది.

పర్యాటకం పేరుతో గిరిజనంపై వేటు

- ప్రపంచ రక్షిత ప్రాంతాలను రెట్టింపు చేయాలనే లక్ష్యం.. గిరిజనులకు ప్రమాదం
- ఇది వారి జనాభాను దెబ్బ తీస్తుంది
- సామాజిక కార్యకర్తలు, నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ : పర్యాటకం పేరుతో రక్షిత ప్రాంతాలను ప్రయివేటీకరించటం స్థానిక తెగల ఉనికికి అత్యంత తీవ్రమైన సవాలుగా పరిణమించింది. అక్కడ నివసించే ఆదివాసీలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని సామాజికవేత్తలు, పర్యావరణ నిపుణులు అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా రక్షిత ప్రాంతాలను దాదాపు రెట్టింపు చేయటం ద్వారా జీవవైవిధ్యాన్ని కాపాడే ప్రయత్నం భారత్‌లోని గిరిజన జనాభాను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్చి 22న యునైటెడ్ స్టేట్స్‌లోని అరిజోనా విశ్వవిద్యాలయం నిర్వహించిన స్వదేశీ సంఘాల హక్కులపై జరిగిన సింపోజియంలో నిపుణులు ఈ మేరకు హెచ్చరించారు.

యూఎన్ కున్మింగ్-మాంట్రియల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్‌వర్క్ ప్రపంచ భూభాగంలో రక్షిత ప్రాంతాలను ప్రస్తుత 16 శాతం నుంచి 30 శాతం వరకు పెంచే లక్ష్యాన్ని అనుసరిస్తే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్థానిక ప్రజలు నష్టపోతారని నిపుణులు అంటున్నారు. దేశంలోని 106 నోటిఫైడ్ నేషనల్ పార్క్‌లలో 89 వారు నివసించిన ప్రాంతాలలో స్థాపించబడ్డాయనీ, ఈ కారణంగా భారత్‌లోని షెడ్యూల్డ్ తెగలు ఈ విస్తరణ భారాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. అంటే.. భారత్‌లోని 84 శాతం రక్షిత ప్రాంతాలు గిరిజన ప్రాంతాలతో అతివ్యాప్తి చెందుతున్నాయని న్యూఢిల్లీకి చెందిన హక్కుల కార్యకర్త సుహాస్ చక్మా 'పరిరక్షణ, జాత్యహంకారం మరియు మూలవాసుల మానవ హక్కులు' అనే అంశంపై జరిగిన సింపోజియంలో అన్నారు.

'అసమాన ప్రభావం'

మిగిలిన 17 నేషనల్ పార్క్‌లలో.. సౌత్ బటన్ ఐలాండ్ నేషనల్ పార్క్, రాణి ఝాన్సీ మెరైన్ నేషనల్ పార్క్(అండమాన్ మరియు నికోబార్ దీవులలో) సముద్ర ప్రాంతాలలో ఉన్నాయి. ఇక్కడ మానవ నివాసాలు లేవు. వాన్ విహార్, కాసు బ్రహ్మానంద రెడ్డి, మహావీర్ హరినా వనస్థలి, సలీం అలీలు జంతుప్రదర్శన శాలలు కాగా.. కల్నల్. షెర్జంగ్ సింబల్‌బరా, నియోరా వ్యాలీ, సింగలీలా, శిలాజాలు కొంత గిరిజన జనాభాను కలిగి ఉన్నాయి. మరోవైపు, ఏడు జాతీయ పార్కులతో సాధారణ వర్గానికి చెందిన ప్రజలు మాత్రమే ప్రభావితమయ్యారని చక్మా చెప్పారు. "భారత్‌లోని మొత్తం జనాభాలో 8.6 శాత ఉన్న ఎస్టీలు కూడా రక్షిత ప్రాంతాల ద్వారా ప్రభావితమైన 84 శాతం కమ్యూనిటీలను కలిగి ఉన్నారు. ఇది ప్రపంచంలోని జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థను కాపాడటానికి స్థానిక ప్రజల అసమాన లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుంది. వారి జీవనశైలి, జీవనోపాధి పద్ధతులు వలసరాజ్యాల కాలం నుంచి అటవీ చట్టాలతో నేరంగా మారాయి "అనిచక్మా అన్నారు. ఇలాంటి చర్యలపై కేంద్రం తగిన చర్యలను తీసుకొని, గిరిజనులకు అండగా ఉండాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు.

లండన్‌లో రోడ్డు ప్రమాదం భారతీయ విద్యార్థిని మృతి

లండన్ : లండన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో భారత పిహెచ్‌డి విద్యార్థిని మరణించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. భారత పరిశోధక విద్యార్థిని చెయిస్తా కొచ్చర్ (33) లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పిహెచ్‌డి చేస్తున్నారు. ఈ నెల 19వ తేదీన కళాశాల నుంచి సైకిల్ తొక్కుకుంటూ సెంట్రల్ లండన్‌లోని తన ఇంటికి వెళుతుండగా, వేగంగా వచ్చిన ట్రక్కు సైకిల్‌ను ఢీకొట్టింది. ఆ సమయంలో ఆమె భర్త ప్రశాంత్ కొంత దూరంలోనే ఉన్నారు. వెంటనే వచ్చి ఆమెను ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా.. తీవ్రగాయాల పాలైన కొచ్చర్ అప్పటికే మరణించారు. ఈ విషయాన్ని తాజాగా కొచ్చర్ తండ్రి రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ ఎస్‌పి కొచ్చర్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఆమె భౌతికకాయాన్ని తీసుకురావడానికి ఆయన లండన్ వెళ్లారు. గురుగ్రామ్‌లో నివాసముండే చెయిస్తా.. సెప్టెంబరులోనే పిహెచ్‌డి కోసం లండన్ వెళ్లారు. గతంలో ఆమె ఢిల్లీ విశ్వవిద్యాలయం, అశోక యూనివర్సిటీ, పెన్సిల్వేనియా, షికాగో విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించారు. 2021-23 మధ్య నీతి ఆయోగ్‌లోని నేషనల్ బిహేవియరల్ ఇన్‌సైట్స్ యూనిట్‌లో సీనియర్ సలహాదారుగా సేవలందించారు.

టిడిపి నేతల నిర్వేదం

- పొత్తులో భాగంగా సీటు కోల్పోయామని ఆవేదన
- కంట తడిపెట్టిన సుగుణమ్మ


మీడియా ఎదుట కంటతడిపెట్టిన సుగుణమ్మ, మనవరాలు కీర్తి

ప్రజాశక్తి - యంత్రాంగం

బిజెపి, టిడిపి, జనసేన పొత్తులో భాగంగా సీట్లు కోల్పోయిన పలువురు నేతలు అసంతృప్తితో ఉన్నారు. బిజెపితో పొత్తు పెట్టుకోవడంతో తమకు సీటు కేటాయించలేదని టిడిపి అధినేతపై బహిరంగానే నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. గట్టిపట్టున్న స్థానంలో కూడా బిజెపి, జనసేనకు సీటు కేటాయించడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ నేతలకు టికెట్లు కేటాయించకుండా రాజీనామాలకు సైతం వెనకాడబోమని టిడిపి ద్వితీయ శ్రేణి నాయకులు హెచ్చరిస్తున్నారు.

తిరుపతి మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ పట్టు వదలకుండా 'టికెట్' కోసం అభ్యర్థిస్తూనే ఉన్నారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు. తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాస్ కాకుండా, స్థానిక అభ్యర్థికి టికెట్ ఇస్తే తమకు ఏమాత్రమూ అభ్యంతరం లేదన్నారు. తిరుపతి అభ్యర్థి విషయంలో ఎన్నో సర్వేలు చేశారని, ఆ సర్వేల్లో తనకే ఎక్కువ అనుకూలంగా ఓట్లు వచ్చాయన్నారు.

విజయవాడ పశ్చిమ నియోజకవర్గం సీటును జనసేన ఇన్‌ఛార్జి పోతిన వెంకట మహేష్‌కు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిరవధిక దీక్షలు ప్రారంభించారు. జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో వెంకట మహేష్‌తోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు దీక్షలు చేపట్టారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ టికెట్‌ను మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్‌కు ఇవ్వాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. బుద్ధప్రసాద్‌కు టికెట్ ఇవ్వకపోతే పార్టీకి రాజీనామా చేస్తామని నాయకులు హెచ్చరించారు. కాకినాడ సిటీ సీటును ఆశించిన మాజీ మేయర్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.సరోజ ఆదివారం రాజీనామా చేశారు. తనకు సీటు కేటాయిస్తానని చెప్పి పవన్‌కల్యాణ్ మోసం చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అనుచరులు, కార్యకర్తల అభీష్టం మేరకు త్వరలో నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గంలో సీటు దక్కకపోవడంతో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాటంశెట్టి సూర్యచంద్ర తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. స్వతంత్రంగా బరిలో దిగుతానని తెలిపారు. ఇప్పటికే ఆయన నియోజకవర్గంలో తన భార్యతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్నారు. అనపర్తిలో నియోజకవర్గం సీటు బిజెపికి కేటాయిస్తారనే వార్తలతో టిడిపి కేడర్‌లో అసంతృప్తి నెలకొంది. ఈ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆశిస్తున్నారు. ఈ సీటును బిజెపికి కేటాయిస్తే ఆయన టిడిపి నుంచి దూరమవుతారని టిడిపి ద్వితీయశ్రేణి నాయకులు చెబుతున్నారు.

ఇ-సిగరెట్లు అంటే...!

ప్రజాశక్తి - అమరావతి



భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుబడ్డ కొద్దిరోజుల్లోనే విశాఖలో పెద్ద ఎత్తున ఇ-సిగరెట్లు పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది. ప్రైవేటు కళాశాలలో నిర్వహించిన అకస్మిక దాడుల్లో తొలుత ఇవి బయటపడ్డాయి. అనంతరం నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ వీటిని స్వాధీనం చేసుకున్నారు. అధికార యంత్రాంగం దృష్టి సారిస్తే మరికొన్ని ప్రాంతాల్లోనూ ఇవి దొరికే అవకాశం ఉంది. పొగాకుతో తయారు చేసిన సిగరెట్లకు ప్రత్యామ్నాయంగా 2003వ సంవత్సరంలో మొదటి సారి మార్కెట్‌లోకి ప్రవేశించిన ఇవి కూడా తీవ్ర హానికరంగా మారిన విషయాన్ని అనతికాలంలోనే గుర్తించారు. సిగరెట్లు మానడానికి ఉపయోగపడతాయన్న ప్రచారంతో మన దేశంతో ప్రపంచవ్యాప్తంగా వీటి వినియోగం పెరిగింది. 2011 నాటికి 70 లక్షల మంది వీటిని వినియోగిస్తుండగా, 2020 నాటికి వీరి సంఖ్య 100 కోట్లకు చేరింది. మరోవైపు ఇ-సిగరెట్లుకూడా ప్రాణాంతకంగా మారడాన్ని ప్రపంచం గుర్తించింది. దీనిలో ద్రవంతో నిండిన కార్ట్రిడ్జ్ (చిన్న ట్యాంకు), ద్రవాన్ని వేడిచేసేందుకు అటామైజర్ (వేడిచేసే పరికరం) ను వినియోగిస్తారు. దీనినిఛార్జి చేసుకుని వినియోగించుకోవచ్చు. అయితే, ఈ ద్రవంలోనూ నికోటిన్‌ను వాడుతున్నారు. దానితో పాటు సిగరెట్లలోని హానికరమైన పదార్ధాలనూ గుర్తించారు. నేరుగా నికోటిన్‌ను పీల్చడంతో వీటిని మానుకోవడం మరింత కష్టంగా మారింది. వీటిని వాడేవారు స్వల్పకాలంలోనే వీటికి బానిసలుగా మారారు. సిగరెట్ల కన్నా తక్కువ ప్రమాదమన్న ప్రచారంతో అప్పటివరకు అలవాటు లేని వారు. యువకులు వీటికి అలవాటు పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) వీటి వినియోగంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. నిషేధించాలని ప్రపంచదేశాలకు పిలుపునిచ్చింది. 2019 సెప్టెంబర్‌లో భారతదేశం వీటి వినియోగాన్ని సంపూర్ణంగా నిషేధించింది. తయారుచేయడం, నిలువచేయడం, అమ్మడం నిషేధమని ప్రకటించింది. 2023లో డబ్ల్యుహెచ్‌ఒ విడుదల చేసిన నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 33 దేశాలు ఇ-సిగరెట్లను నిషేధించాయి. మరో 87 దేశాలు వినియోగంపై ఆంక్షలు విధించాయి.

సామాజిక అభివృద్ధిని కోరుకోవడం అతివాదమా ? : సాయిబాబా

న్యూఢిల్లీ : మానవత్వాన్ని, సామాజిక అభివృద్ధిని కోరుకోవడం అతివాదమా అని మానవహక్కుల కార్యకర్త, ఢిల్లీ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా ప్రశ్నించారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే అరోపణలపై 2014లో అరెస్టయిన సాయిబాబా ఏడేళ్ల జైలుశిక్ష తర్వాత ఈ నెల 7న నాగపూర్ సెంట్రల్ జైలు నుండి నిర్దోషిగా విడుదలైన సంగతి తెలిసిందే. జైలు నుండి విడుదలైన తర్వాత సోమవారం ఆయన మొదటిసారిగా మీడియాతో మాట్లాడారు. ఇంతకాలం జైలు శిక్ష అనుభవిస్తానని ఊహించలేదని అన్నారు. నేరారోపణకు ముందు మొత్తం మూడేళ్ల వ్యవధిలో 17 నెలలు, నేరారోపణ అనంతరం సుమారు ఏడేళ్లు. అంటే గత పదేళ్లలో ఎనిమిదిన్నరేళ్లు జైలులోనే ఉన్నట్లు తెలిపారు. మొదటి విడుదల ఆర్డర్ వచ్చిన తర్వాత సుమారు ఒకటిన్నరేళ్ల పాటు జైలు జీవితం గడిపానని, విడుదల తర్వాత ఆర్డర్ పొందాల్సి వచ్చిందని .. బహుశా భారత న్యాయ చరిత్రలో ఇలా ఎప్పుడూ జరగలేదని అన్నారు. జైలుకు వెళ్లిన తర్వాత జీవితం మారిపోయిందన్నారు. అరెస్ట్ చేసే సమయంలో పోలీసులు దురుసు ప్రవర్తన కారణంగా మెదడుతో భుజాన్ని కలిపే నాడీ వ్యవస్థ దెబ్బతినడంతో భుజంపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఇప్పుడు ఎడమ చేతితో పుస్తకాన్ని కూడా పట్టుకోలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. స్లీప్ అప్నియా ప్రారంభమైందని, గుండె ఎడమభాగం కేవలం 55 శాతం సామర్థ్యంతోనే పనిచేస్తుందని చెప్పారు. ప్యాంక్రియాటైటిస్, ఇలా పలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. చికిత్స తీసుకోవాల్సి వుందని,అయితే ఎంతమేర ప్రభావితం చూపుతుందో చెప్పలేమని అన్నారు. జైలులో తగిన వైద్యం పొందకపోవడం గురించి మాట్లాడుతూ.. వైద్య కారణాలతో బెయిల్‌ను హైకోర్టు రెండుసార్లు తిరస్కరించిందని, అయితే రెగ్యులర్‌గా వైద్యం అందించాలన్న ఆదేశాన్ని జైలు అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. చెకప్‌ల పేరుతో నాగ్‌పూర్ మెడికల్ కాలేజీకి పంపేవారని, కానీ ట్రీట్‌మెంట్ సరిగ్గా చేయలేదని చెప్పారు. విడుదల కావడానికి ముందు ప్రతి మెడికల్ డిపార్ట్‌మెంట్ "ఈ చికిత్స అందుబాటులో లేదు. ట్రీట్‌మెంట్ చేయలేం. మరోచోట అందుబాటులో ఉంటుంది" అని రాశారని, పదేళ్ల తర్వాత వైద్యులు అలా రాయకుండా మొదట్లోనే ప్రస్తావించి ఉండాల్సిందని అన్నారు. జైలు అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం తనను ఉగ్రవాదనని భయపెట్టి, ఒంటరిగా ఉంచాలని ప్రయత్నించినా కొంతమంది జవాన్లు, తోటి ఖైదీలు స్నేహపూర్వకంగా మెలిగారని తెలిపారు. తన భార్య వసంత రాసే ఉత్తరాలు, డిజిటల్ ప్రింట్‌లు, పుస్తకాలతో గడిపేవాడినని తెలిపారు. జైలు బయట జరిగే వివరాలను కూడా ఉత్తరాల్లో తనకు తెలిపేదని, సొంత ఖర్చుతో ఇంగ్లీష్ పేపర్స్ కొనుక్కునేవాడినని చెప్పారు. మిగిలిన సమయాల్లో ఖైదీలకు చదవడం, రాయడం నేర్పించడంతో పాటు ఖైదీలకు పిటిషన్లు రాసేందుకు అధిక సమయం వెచ్చించినట్లు తెలిపారు. మానవత్వాన్ని, సామాజిక అభివృద్ధిని కోరుకోవడం అతివాద దృక్పథమా అని ప్రశ్నించారు. ప్రజలతో మమేకమై ఉండటం, వారికి అవగాహన కలిగించడం నేరమా అని ప్రశ్నించారు.

హోళీ వేడుకల్లో విషాదం

- కొండచరియలు విరిగిపడి ఇద్దరు మృతి

హిమాచల్ ప్రదేశ్ : హోలీ పండుగ వేడుకల వేళ ... హిమాచల్ ప్రదేశ్‌లో విషాదం చోటుచేసుకుంది. సోమవారం ఉనా జిల్లా అంబ్ సబ్ డివిజన్‌లోని మేడిలో హోలీ వేడుకలు జరుగుతున్న ప్రాంతంలో అకస్మాత్తుగా కొండచరియలు విరిగిపడటంతో ఇద్దరు మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. పండుగ వేడుకల్లో భాగంగా ... గంగా నదిలో స్నానాలు చేస్తుండగా, అకస్మాత్తుగా కొండపై నుంచి రాళ్లు పడటంతో భయాందోళనకు గురై పలువురు పరుగులు తీయడంతో తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు మరణించగా, తొమ్మిదిమంది గాయపడ్డారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని ఉనా ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారందరినీ సివిల్ ఆస్పత్రికి తరలించారు.

సంపాదకీయం


డ్రగ్స్ పాలిట్రిక్స్!

విశాఖ పోర్టులో భారీ మొత్తంలో మాదక ద్రవ్యాల పట్టివేత దేశాన్నే ఉలికిపాటుకు గురి చేసింది. అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా మన నట్టింటి దాకా రావడం ఆందోళనకరంకాగా, దీనిలో ప్రధాన రాజకీయ పార్టీల ప్రమేయం ఉందన్న విమర్శలు బ్లాస్ట్ కావడం కల్లోలం రేపుతున్నాయి. బ్రెజిల్‌లో శాంతోస్ పోర్టు నుంచి జనవరి 14న బయలుదేరిన నౌక జర్మనీ మీదుగా వైజాగ్ పోర్టుకు ఈ నెల 16న చేరుకొని, స్థానిక సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు బుక్ అయిన కంటైనర్‌ను దించి వెళ్లిపోయింది. కంటైనర్‌లో నిషేధిత డ్రగ్స్ ఉన్నాయని ఇంటర్‌పోల్ ద్వారా మన దేశాన్ని అప్రమత్తం చేశారు. సిబిఐ, కస్టమ్స్ అధికారులు విశాఖకొచ్చి కంటైనర్‌ను పరిశీలించి నార్కోటిక్ పరీక్షలు చేసి అత్యంత ప్రమాదకర కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలున్నట్లు గుర్తించి నిర్ధారణ కోసం నమూనాలను ల్యాబ్‌కు పంపారు. రిపోర్టులు రావడానికి రెండు వారాలు పడుతుందంటున్నారు. కంటైనర్‌లో రొయ్యల మేతకు ఉపయోగించే డ్రైడ్ ఈస్ట్‌లో డ్రగ్స్ మిక్స్ చేశారన్నది అభియోగం. వెయ్యి బస్తాల్లోని 25 వేల కిలోల డ్రైడ్ ఈస్ట్‌లో ఐదు వేల కిలోల డ్రగ్స్ మిక్స్ అయ్యాయని అంచనా. విలువ రూ.లక్ష కోట్లకు పైమాటేనంటున్నారు.

యువతను నిర్వీర్యం చేసే మన ఆర్థిక వ్యవస్థను దారుణంగా దెబ్బతీసే డేంజరస్ డ్రగ్స్ నిరోధానికి కేంద్ర సంస్థల్లో సాచివేత తిష్ట వేసిందనడానికి విశాఖ ఉదంతమే ఉదాహరణ. ఇంటర్‌పోల్ చెప్పాక కూడా సకాలంలో కదల్లేదు. 16న పోర్టుకు వచ్చిన ఓడ కంటైనర్‌ను స్వేచ్ఛగా దించేసి తమిళనాడు వెళ్లిపోయింది. దర్యాప్తు సంస్థలు తీరిగ్గా 18న విశాఖ వచ్చాయి. ఎందుకు రెండు రోజులు ఆలస్యమైందో ఆ సంస్థలే చెప్పాలి. వచ్చాక కూడా రాష్ట్ర ప్రభుత్వ అధికారుల, పోర్టు ఉద్యోగుల ఆటంకాల వలన దర్యాప్తులో జాప్యం జరిగిందని ఎఫ్‌ఐఆర్‌లో సిబిఐ పేర్కొంది. విశాఖ పోర్టు కేంద్ర బలగాల ఆధీనంలో ఉంటుంది. రాష్ట్ర అధికారులు, పోర్టు ఉద్యోగులు దర్యాప్తును అడ్డుకుంటుంటే సిబిఐ చోద్యం చూసిందెందుకు? దీనిపై విశాఖ పోలీస్ కమిషనర్ సాంకేతిక అంశంగా కొట్టిపడేశారు. సంధ్యా సంస్థపై సిబిఐ దాడులు చేసిందంటుండగా, కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి వద్ద మూడు రోజులుగా నిలిపిన ఆ సంస్థ బస్సును ఎవ్వరూ పట్టించుకోలేదు. ప్రజలు సమాచారం ఇచ్చాకనే కదిలారు. డ్రగ్స్ పట్టుబడి ఐదు రోజులవుతున్నా సిబిఐ దర్యాప్తు వీసమెత్తు కదలకపోవడంతో అనుమానాలు కలగడం సహజం.

సంధ్యా సంస్థ ఓనర్లతో చంద్రబాబు, లోకేష్, పురందేశ్వరికి సంబంధ బాంధవ్యాలున్నాయని అధికార వైసిపి ఆరోపిస్తోంది. వైసిపి నేతలకే ఆ సంస్థ ప్రతినిధులతో మైత్రి బంధాలున్నాయని టిడిపి ప్రత్యారోపణలకు దిగింది. టిడిపి, వైసిపి, బిజెపి, జనసేన పరస్పర నిందాపర్వంతో డ్రగ్స్ వ్యాపారంలో ఆ నాలుగు పార్టీల నేతలకు సంబంధాలున్నాయని తేటతెల్లమౌతోంది. మధ్యలో బ్రిజిల్ అధ్యక్షుడు, వామపక్షవాది లూలాను లాగడంపై అసహ్యమేస్తోంది. ఇటీవలి కాలంలో ఎ.పి. గంజాయికి, డ్రగ్స్‌కు, అక్రమ మద్యానికి ఆలవాలంగా మారిందని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో వంటి సంస్థల నివేదికలు చెబుతున్నాయి. రెండేళ్ల కింద అఫ్ఘనిస్థాన్ నుంచి విజయవాడ చిరునామాపై గుజరాత్ ముంద్రా పోర్టుకు వచ్చిన భారీ డ్రగ్స్‌ను పట్టుకున్నారు. ఆ కేసు ఏమైందో తెలీదు. ముంద్రా పోర్టు అదానీ చేతిలో ఉంది. విశాఖకు వచ్చిన డ్రగ్స్ కంటైనర్ దిగింది ముంబయికి చెందిన జెఎస్ బక్షి గ్రూపునకు చెందిన బెర్త్‌లోనే. ప్రైవేటు కంపెనీలు నిర్వహించే పోర్టులకు డ్రగ్స్ రావడం చూస్తున్నాం. అక్కడ చెకింగ్స్ ఉండవనే. విశాఖ పోర్ట్‌ను అదానీ శాసిస్తున్నారు. సర్కారు అండతో గంగవరం వశం చేసుకున్నారు. ప్రైవేటు పోర్టులు డ్రగ్స్‌కు, అక్రమ ఆయుధ వ్యాపారాలకు అడ్డాలుగా మారుతున్నాయనడానికి పలు ఉదంతాలున్నాయి. విశాఖ వంటి మేజర్ పోర్టును ప్రైవేటీకరిస్తే దేశ భద్రత ప్రమాదంలో పడుతుంది. విశాఖ డ్రగ్స్‌పై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలి. నిష్పాక్షికత కొరవడితే ప్రజలు నమ్మరు. ప్రమాదకర డ్రగ్స్ దందా ఆగదు. దేశానికి పెనుముప్పు వాటిల్లుతుంది.

మంచి మాట



ఒక విషయాన్ని ఇతరులకు సులభంగా అర్థం అయ్యేలా వివరించలేకపోవడమంటే... నీకే ఆ విషయం పూర్తిగా అర్థం కానట్లు లెక్క.

- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

Albert Einstein

పేదరికపు గణాంకాల గురించి మరొకసారి...




ప్రభాత్ పట్నాయక్

ఈ మధ్య నీతి ఆయోగ్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి ఒక 'అద్భుతమైన' ప్రకటన చేశారు. 2022-23 వినిమయ ఖర్చు సర్వే వెల్లడించిన వివరాల ప్రకారం మన దేశంలో పేదరికం 5 శాతం కన్నా దిగువకు పడిపోయిందట! దీనికి ప్రాతిపదిక ఏమిటి? సురేశ్ టెండూల్కర్ కమిటీ నిర్దేశించిన దారిద్ర్య రేఖ (2011-12 సంవత్సరం ప్రమాణంగా)ను వినిమయ ధరల సూచీలో వచ్చిన పెరుగుదల ప్రకారం తాజా పరిస్థితికి అనుగుణంగా సవరించి దానితో పోల్చితే 2022-23లో దేశ జనాభాలో ఆ రేఖ కన్నా దిగువన 5 శాతం కన్నా తక్కువే ఉన్నారట!

టెండూల్కర్ కమిటీ 2011-12 సంవత్సరానికిగాను దారిద్ర్య రేఖను నిర్ణయించినదానికి ప్రమాణాలు లేదా ప్రాతిపదిక ఏమిటి? కనీసం ఒక కుటుంబానికి ఏయే సరుకులు, సేవలు ఏయే మేరకు అవసరం అవుతాయి, ఒక వ్యక్తి కనీసం ఎన్ని క్యాలరీల శక్తినిచ్చే ఆహారాన్ని రోజూ తీసుకోవాలి వంటి ప్రమాణాలు ఏవీ పరిగణించలేదు. ఏకపక్షంగా ఆ దారిద్ర్య రేఖను నిర్ణయించారు. దానిని కూడా ఈ ప్రభుత్వం ఇప్పుడు వినిమయ ధరల సూచీకి అనుగుణంగా సవరించారు. ఈ వినిమయ ధరల సూచీ విద్య, వైద్యం వంటి సేవలు ప్రైవేటీకరించబడిన వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోవు. అందుచేత వాస్తవ పెరుగుదలను అవి పూర్తిగా ప్రతిబింబించవు. ఇక 2022-23లో చేపట్టిన వినిమయ సర్వే అంతకు పూర్వపు సర్వేల విధానాన్నే అనుసరించి వుంటే పోల్చడానికి వీలు ఉండేది. కాని అంతకు ముందరి సర్వేలకు భిన్నంగా ఈ సర్వే జరిగింది. అందుచేత ఈ సర్వేలో వచ్చిన వివరాలను అంతకు పూర్వపు సర్వేలతో సరిపోల్చడానికి సాధ్యం కాదు. పైగా ఈ తాజా సర్వే వివరాలు పూర్తిగా ఇంకా వెల్లడి కాలేదు.

అందుచేత నీతి ఆయోగ్ ప్రకటించినట్టు పేదరికం జనాభాలో 5 శాతం కన్నా తక్కువ అని నిర్ధారించడానికి తగిన ఆధారాలు లేవు. పైగా దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి మనకు లభిస్తున్న తక్కిన సమాచారంతో పోల్చి చూసినప్పుడు పేదరికం తగ్గిపోయిందన్న ప్రచారం ఎన్నికల సమయంలో ప్రభుత్వం చేసుకోడానికి వీలుగా ఈ ప్రకటన వెలువడిందన్న నిర్ధారణకు రాక తప్పుదు. ఆ ఇతర సమాచారం ఏమిటో చూద్దాం.

2017-18లో చేపట్టిన వినిమయ సర్వే వెల్లడించిన వివరాలు ఎంత దయనీయ పరిస్థితిని వెల్లడించాయంటే ఆ సర్వే వివరాలను ప్రభుత్వం బహిరంగ పరచడానికి సిద్ధపడలేదు. వాటిని వెనక్కి తీసేసుకున్నారు. ఈ లోపు మనకు పొక్కిన సమాచారాన్నిబట్టి కనీస పౌష్టికాహారం (ప్లానింగ్ కమిషన్ అప్పుడు నిర్ధారించిన ప్రకారం రోజుకు 2100 క్యాలరీలు పట్టణాలలో. అదే గ్రామాల్లోనైతే రోజుకు 2200 క్యాలరీలు) పొందలేకపోతున్నవారు 1993-94లో 57 శాతం ఉంటే అది 2017-18 నాటికి 60 శాతానికి పెరిగింది. ఇది పట్టణాలలోని పరిస్థితి. ఇక గ్రామీణ ప్రాంతాలకు వస్తే 1993-94లో 57 శాతం, 2011-12లో 65 శాతం ఉన్నది కాస్తా 2017-18కి 80 శాతానికి అమాంతం పెరిగిపోయింది. అంటే పేదరికం 2011-12 నుంచి 2017-18 మధ్య కాలంలో బాగా పెరిగిపోయింది. ఆ తర్వాత మనం కరోనా మహమ్మారి బారిన పడ్డాం. దానికి లాక్‌డౌన్ తోడైంది. దాంతో ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. కరోనాకు మునుపు ఉన్న నిరుద్యోగం కన్నా ఎక్కువగా నేడు నిరుద్యోగం తాండవమాడుతోంది. 2017-18 నాటి పరిస్థితినైనా అధిగమించగలిగామా లేదా అన్నదే సందేహాస్పదంగా ఉంది. అటువంటప్పుడు 2011-12 నాటి పరిస్థితిని కూడా అధిగమించి పేదరికాన్ని ఏకంగా 5 శాతం కన్నా తక్కువకి తగ్గించేశామని చెప్పుకోవడం ఏ మాత్రమూ విశ్వసనీయంగా లేదు.



కేవలం ఆకలి సూచిక ఒక్కటే కాదు. తగినంత శక్తి లేని పిల్లలు, వివిధ లోపాలతో జన్మించే పిల్లలు, పెరుగుదల లేకుండా నిలిచిపోయిన పిల్లలు, చిన్న పిల్లల మరణాలు-ఇవన్నీ కూడా కొన్ని ప్రమాణాలే. వాటిని బట్టి చూసినా 2008తో పోల్చినప్పుడు 2023 నాటికి మన పరిస్థితి ఘోరంగా దిగజారిపోయింది. అందుచేత అల్పాదాయ వర్గాల ఆదాయాలు పెరిగాయి అని చెప్పుకుంటున్న దానిలో ఏమాత్రమూ వాస్తవం లేదు.

ఎన్ని క్యాలరీల శక్తినిచ్చే ఆహారం తీసుకుంటున్నారు అన్నదే పేదరికానికి కొలబద్ద కాజాలదు అని వాదించేవారున్నారు. వారి వాదన ఒక పొరపాటు అవగాహన మీద ఆధారపడి వుంది. కేవలం క్యాలరీల ప్రాతిపదికను ఒక్కదానిని మాత్రమే పేదరికాన్ని అంచనా వేయడానికి కొలబద్దగా తీసుకోవాలన్నది కాదు ఇక్కడ మనం చెప్పేది. నికర ఆదాయాల్లో పెరుగుదల వచ్చినప్పుడు తీసుకునే ఆహారపు క్యాలరీల విలువ కూడా పెరగాలి అన్నదే ఇక్కడ మన వాదన. ఒకవైపు ఆదాయం పెరిగినా తీసుకునే ఆహారపు క్యాలరీల విలువ తగ్గవచ్చు అన్న వాదన పూర్తిగా తప్పు. కేవలం నిజ వేతనాలు తగ్గిపోయినప్పుడు మాత్రమే తీసుకునే ఆహారపు కేలరీల విలువ తగ్గిపోతుంది. ప్రపంచ దేశాల గణాంకాలను పరిశీలించినప్పుడు తలసరి ఆదాయం పెరుగుదలకు, తలసరి ఆహారధాన్యాల వినియోగం పెరుగుదలకు ప్రత్యక్ష సంబంధం ఉంది అని స్పష్టంగా నిర్ధారణ అయింది.

మన దేశంలో ఆదాయాలు ఎంతెంత వస్తున్నాయి అన్నదానికి సంబంధించిన గణాంకాలు ఏవీ లేవు. కేవలం వినిమయానికి చేస్తున్న ఖర్చుల గణాంకాలు మాత్రం లభ్యమౌతున్నాయి. ఈ ఖర్చులను ఒక దీర్ఘకాలంలో పోల్చి చూడాలంటే ధరల సూచీ ఆధారంగా వాటిని సవరించడం ఒక్కటే మార్గం. కాని ఆ ధరల సూచికలకున్న లోపాల దృష్ట్యా అవి ఆదాయాల పెరుగుదలను సక్రమంగా అంచనా వేయడానికి తోడ్పడవు. ఇక తీసుకునే ఆహారపు క్యాలరీల విలువను బట్టి పోల్చి చూడడం ఒక్కటే మన ముందున్న నమ్మదగిన విధానం. దానిని బట్టి చూస్తే 2017-18 వరకూ మన దేశంలో పేదరికం పెరుగుతూనే వచ్చింది. ఇక ఆ తర్వాత వివరాలే లేవు. తాజాగా 2022-23కు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన వినిమయ సర్వే వివరాలను ప్రభుత్వం వెల్లడి చేస్తే దేశంలో పేదరికం పరిస్థితిని మనం తాజాగా అంచనా వేయగలుగుతాము. అంతవరకూ మనం ఇతరత్రా లభిస్తున్న వివరాల మీద ఆధారపడక తప్పదు.

అటువంటి పరోక్ష ఆధారాలలో మొదటిది జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే. 2019-21 వరకూ ఉన్న కాలానికి సంబంధించిన 5వ సర్వే ప్రకారం 2015-16తో పోల్చితే 2019-21 నాటికి రక్తహీనతతో బాధపడే మహిళలు (15 నుంచి 49 సంవత్సరాల మధ్య వయస్కులు) 53 శాతం నుండి 57 శాతానికి పెరిగారు. 2015-16లో 50 శాతం కన్నా ఎక్కువ జనాభా రక్తహీనతతో బాధపడే మహిళలు ఉన్న రాష్ట్రాలు 21 ఉంటే 2019-21 నాటికి వాటి సంఖ్య 25కి పెరిగింది. సంపన్న దేశాల మహిళలకు ఉపయోగించే ప్రమాణాలనే ఇక్కడ కూడా ఉపయోగించడం సరైనది కాదని వాదిస్తున్న వారున్నారు. కాని ఇక్కడ ప్రమాణాలేమిటి అన్నది కాదు ప్రధానం. అవే ప్రమాణాలను గతంలోను, ఇప్పుడు ఉపయోగిస్తున్నాం. అయినా గతంలో పోల్చితే ఇప్పుడు రక్తహీనత పెరిగింది. అదీ ప్రధానం.

మన ప్రభుత్వం ఎన్ని గొప్పలు చెప్పుకుంటున్నా, యావత్ ప్రపంచానికీ మన దేశం పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న సంగతి బాగా తెలుసు. ఐరాస నివేదిక ప్రకారం ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్‌ఎవో) దక్షిణాసియా దేశాలకు నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పౌష్టికాహారం పొందలేకపోతున్నవారు భారత దేశంలో 74 శాతం ఉన్నారు. ఇది చేదు నిజం.

రెండవ పరోక్ష ఆధారం ప్రపంచ ఆకలి సూచిక. ప్రపంచ ఆకలి సూచిక అట్టడుగున్న ఉన్న 125 దేశాలను పరిశీలిస్తుంది. అందులో మన దేశం 2023లో 111వ స్థానంలో ఉంది. ఆకలి సూచికను లెక్కిస్తున్న విధానం సక్రమంగా లేదని మన ప్రభుత్వం అభ్యంతరం పెడుతోంది. ఆ విధానంలోని లోపాల మాట ఎలా ఉన్నా, వారు ఒకటే విధానాన్ని కొనసాగిస్తున్నారు. అటువంటప్పుడు తలసరి ఆదాయాలు గణనీయంగా పెరిగిపోతున్నాయంటూ చెప్పుకుంటున్న మన దేశం ఆకలి సూచికలో దిగజారవలసిన పరిస్థితి ఎందుకొచ్చింది? దారిద్ర్య రేఖకు దిగువన ఉండేవారి సంఖ్య బాగా తగ్గిపోయిందని చెప్పుకుంటున్న ప్రభుత్వం ఆకలి సూచికలో మన దేశం స్థానం దిగజారిపోడానికి కారణం ఏమిటో చెప్పగలదా?

కేవలం ఆకలి సూచిక ఒక్కటే కాదు. తగినంత శక్తి లేని పిల్లలు, వివిధ లోపాలతో జన్మించే పిల్లలు, పెరుగుదల లేకుండా నిలిచిపోయిన పిల్లలు, చిన్న పిల్లల మరణాలు-ఇవన్నీ కూడా కొన్ని ప్రమాణాలే. వాటిని బట్టి చూసినా 2008తో పోల్చినప్పుడు 2023 నాటికి మన పరిస్థితి ఘోరంగా దిగజారిపోయింది. అందుచేత అల్పాదాయ వర్గాల ఆదాయాలు పెరిగాయి అని చెప్పుకుంటున్న దానిలో ఏమాత్రమూ వాస్తవం లేదు.

ఇక తల్లిపాలు తప్ప వేరే ఇతర ఆహారం ఏదీ పొందలేని చిన్న పిల్లలు (6 నెలల నుండి 23 నెలల వయస్సు ఉండే చిన్న పిల్లలు) 67 లక్షలమంది 2023లో ఉన్నారు. ఈ వయస్సు పిల్లలకు తల్లిపాలతోబాటు ఇతరత్రా అదనపు ఆహారం కూడా అందాలి. కాని అలా పొందలేనివారు ఆ వయస్సుగల మొత్తం పిల్లల్లో 19.3 శాతం ఉన్నారంటే అది మన పేదరికానికి అద్దం పడుతుంది. ఈ విషయంలో మనకన్నా కేవలం రెండే రెండు దేశాలు వెనకబడివున్నాయి. అవి గినీ (21.8 శాతం), మాలి (20.5 శాతం). మన ప్రభుత్వం చెప్పుకుంటున్న గొప్పలు ఎంత బూటకమో దీనిని బట్టే చెప్పవచ్చు.

మన ప్రభుత్వం ఎన్ని గొప్పలు చెప్పుకుంటున్నా, యావత్ ప్రపంచానికీ మన దేశం పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న సంగతి బాగా తెలుసు. ఐరాస నివేదిక ప్రకారం ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్‌ఎవో) దక్షిణాసియా దేశాలకు నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పౌష్టికాహారం పొందలేకపోతున్నవారు భారత దేశంలో 74 శాతం ఉన్నారు. ఇది చేదు నిజం.

(స్వేచ్ఛానుసరణ)

కవిత్వం

రెండు ముఖాల శిఖండులే

ఇప్పుడు ఏకోన్ముఖం ఎవడికుందంటావు?
పెట్టుబడి కూడబడ్డప్పుడే
పన్ను కర్ర, బొర్ర మీసం రోషం విడిచేశాయి
రెండు ముఖాల శిఖండులు పురిటి గడ్డను దాటాయి
ఎప్పటికప్పుడు ముందు ముఖాన్ని దాచి
అవసరార్థం రెండోది తిప్పి చూపడమేగా?
వాటి ఆస్తుల పెంపక ఆంతర్యం...
రక్షణావసరం?
పీఠాల బీగాలు చేతికొచ్చాక గడితీరి
అవి డబుల్ ఇంజన్లు తొడుక్కున్నాయి.
తూర్పు పొద్దుపై మబ్బులు మసకేశాక
పడమటి పొద్దు ఎంత ఉగ్రంగా నిలిచినా
తూర్పు పడమర దిక్కులనడానికి దడిసి
ముందూ వెనుకా...బొమ్మా బొరుసా.. పాడాయి
ఆ నుడినీ వదిలి 'స్వదేశీ' మడిని విప్పేశాయి
డబుల్ ఇంజన్ సర్కారులంటూ
'విదేశీ' సాంగుతో 'పాశ్చాత్యం'లో తడిశాయి.
'ఏ రోటికాడ ఆ పాట' నానుడి సారాన్ని
ఆత్మనిర్భర్, వికసిత రాగాలు తీశాయి
నమ్మించడానికి రామ, కృష్ణ తపాలకు దిగాయి
నారీ 'శక్తి' గెలిపిస్తుందనే జపం చేస్తున్నాయి
దేశమేమో వివస్త్రలను చేసిన మణిపూర్ తల్లులనే తలుస్తోంది
ఉపాధి ఊసు, స్వావలంబన లేని నిర్భాగ్యుల చూస్తోంది
రైతును రాజుకాదని 'మద్దతు'లేని బూజుతో కప్పారు
ఓటరేమో మాటలో మాయ, చేతలో ఛాయ చూస్తున్నాడు.
మనలో మాట..ఏ లింగడు ఎక్కడేపాట పాడితేనేం
వాడు కార్చిన సొంగ సారం ఒకటేగా
సంపదలోని కష్టం కనపడకుండా దాచడం
కలవాళ్ళకు సర్వం దోచి పెట్టడం .. ఇదేగా
రెండు ముఖాల శిఖండుల అంతర్నాటకం.
ఎంత డబుల్ ఇంజన్లు అయితే మాత్రం
గద్దలకు పెట్టేవన్నీ కాకులను కొట్టినవేననే
నిజాలను దీపం ముడ్డి నీడలో దాచి
ఎంత దూరం ఎన్నాళ్ళీడుస్తాయి?
మసక మబ్బులు చెదిరే వరకేగా?
తూర్పు పొద్దు కణకణ మండేక
అన్నీ బహిరంగ వెలుగులేగా ?
ఎన్నికల బాండ్ల 'క్విడ్ ప్రో కోల్లా'గా.

- ఉన్నం వెంకటేశ్వర్లు

మీ రచనలను పంపాల్సిన మెయిల్ : editpageps@ gmail.com

మూర్ఛ వ్యాధి - అవగాహన

సందర్భం

ప్రపంచ వ్యాప్తంగా మార్చి 26న 'ప్రపంచ మూర్ఛ రోగ అవగాహన దినం లేదా వరల్డ్ ఎపిలెప్సీ అవేర్‌నెస్ డే'ను పాటిస్తున్నాం. ఎపిలెప్సీ లేదా మూర్ఛ రోగం లేదా కాకిసోమాల వ్యాధి పట్ల సామాన్య ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ రోజు ఉద్దేశం. ప్రపంచవ్యాప్తంగా 65 మిలియన్ల ఎపిలెప్సీ రోగులున్నారని, వీరిలో 80 శాతం అభివృద్ధి చెందుతున్న, మధ్య ఆదాయ దేశాల్లోనే ఉన్నారని తేలింది. ప్రతి 26 అమెరికన్లలో ఒకరికి తన జీవిత కాలంలో ఎపిలెప్సీ వచ్చే అవకాశం ఉందని తేలింది. అయితే ఎపిలెప్సీ రుగ్మతగల స్త్రీపురుషులు పూర్తి జీవితాన్ని అనుభవించే అవకాశాలే ఎక్కువ. కొన్ని కేసుల్లో అకాల మరణాలు కూడా చోటు చేసుకోవచ్చు.

రోగ లక్షణాలు

మూర్ఛ రోగ లక్షణాలుగా అసాధారణ ప్రవర్తన, స్పృహ కోల్పోవడం, తాత్కాలిక గందరగోళం, నిశ్చేష్టంగా చూడడం, కాళ్ళు చేతులు నియంత్రణ కోల్పోయి కదలడం, భయపడడం, ఉద్రేక పడడం లాంటివి కలిగి ఉంటారు. అధిక జ్వరం, తలకు గాయాలు, రక్తంలో షుగర్ లెవల్స్ పడిపోవడం, ఆల్కహాల్ అలవాటును ఒక్కసారిగా మానడం లాంటి సందర్భాలలో మూర్ఛలు బయట పడతాయి. సరైన చికిత్స అందుబాటులో లేని ఎపిలెప్సీ రుగ్మత చిన్న పిల్లలు, వృద్ధులలో అధికంగా కనిపిస్తుంది. మహిళల కన్న పురుషుల్లో దీని ప్రభావం ఎక్కువ.

కేంద్ర నాడీమండలంతో పాటు మెదడు సంబంధ రుగ్మతల్లో మూర్ఛ రోగం నాల్గవ ముఖ్య వ్యాధిగా గుర్తించబడి అనాదిగా మిలియన్ల ప్రజలను పట్టి పీడిస్తున్నది. భారత్‌లో 10 మిలియన్ల మూర్ఛరోగులున్నారని అంచనా (జనాభాలో దాదాపు ఒక శాతం). మన దేశంలో పేదరికం, సాంప్రదాయ నమ్మకాలు, మూఢ విశ్వాసాలు, ఆరోగ్య కేంద్రాలు అందుబాటులో లేకపోవడం, సుశిక్షితులైన ఆరోగ్య సిబ్బంది కొరత, యాంటీ-ఎపిలెప్సీ ఔషధాల పట్ల అవగాహన లోపించడం లాంటి కారణాలతో మూర్ఛ రోగుల సంఖ్య పెరుగుతోంది. ఎపిలెప్సీ అనబడే మెదడుకు సంబంధించిన రుగ్మత (మెదడుకు గాయం, బ్రెయిన్ ట్యూమర్లు, మెదడుకు ఇన్‌ఫెక్షన్లు సోకడం)గా భావిస్తారు.


ఎపిలెప్సీల్లో 25 శాతం నివారించదగినవే అని నమ్మాలి. తలకు గాయాలు కాకుండా చూసుకోవడం, గర్భంలోని శిశువుల సంరక్షణ, జ్వరం వచ్చినపుడు శరీర ఉష్ణోగ్రత పెరగకుండా చూడడం, బిపి/షుగర్/స్థూలకాయాలను నియంత్రించుకోవడం, పొగాకు/ఆల్కహాల్ వాడకం తగ్గించుకోవడం, మెదడుకు ఇన్‌ఫెక్షన్లు సోకకుండా జాగ్రత్త పడడం లాంటి చర్యలతో ఎపిలెప్సీని నివారించవచ్చని తెలుసుకోవాలి.

మూర్ఛ రోగం పట్ల కుటుంబ పెద్దలు, యువత సంపూర్ణ అవగాహన కలిగి, ఎలాంటి అపోహలకు తావు లేకుండా, రోగులకు ధైర్యాన్ని అందిస్తూ ఎపిలెప్సీ రుగ్మతల కట్టడికి కృషి చేయాలి. పేదరికం, అధిక జనాభా, నిరక్షరాస్యత లాంటి తీవ్ర సమస్యలు ఉన్న భారత్ లాంటి దేశాల్లో మూర్ఛ రోగం బహు భారంగా నిలుస్తున్నది. ఇలాంటి ఎపిలెప్సీ రుగ్మత పట్ల ముప్పేట సమూహిక దాడి చేద్దాం, ఆరోగ్య భారత నిర్మాణ యజ్ఞంలో మనందరం భాగస్వామ్యం తీసుకుందాం.

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
సెల్: 9949700037

మత ఆధారిత చట్టం రాజ్యాంగ విరుద్ధం

విశ్లేషణ



సెబాస్టియన్ పాల్

కోవిడ్ సమయంలో 2019లో పౌరసత్వ సవరణ చట్టాన్ని తెచ్చారు. నాలుగు సంవత్సరాల నిద్రాణ స్థితి తర్వాత... సార్వత్రిక ఎన్నికల పవనాలు వీస్తున్న వేళ...గణతంత్ర రాజ్య చైతన్యానికి, లౌకికవాదానికి తూట్లు పొడిచిన చట్టం రెక్కలు విప్పింది. మూడు పొరుగు ముస్లిం దేశాల నుండి వచ్చిన శరణార్థులకు పౌరసత్వం కల్పించడాన్ని ఎవరూ అభ్యంతరం చెప్పరు. అయితే, శరణార్థుల నుండి ముస్లింలను మినహాయించాలన్న నిబంధనే ఆమోదయోగ్యం కాదు. ఈ విధంగా ఎంత మంది ముస్లింలు మినహాయించబడతారనే దానికంటే దాని వెనకున్న సూత్రం, వైఖరి అత్యంత ప్రమాదకరమైనవి.

ఈ చట్టం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు వుండవని ఓ వైపు నుంచి ఓదార్పు వచనాలు వినబడుతున్నాయి. అయినప్పటికీ పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమైనది. ఎందుకంటే లౌకికవాదాన్ని రాజ్యాంగ ప్రాథమిక లక్షణంగా ప్రకటించిన మన దేశంలో...ఈ చట్టం మతం ఆధారంగా వివక్షకు వీలు కల్పిస్తున్నది. 2025లో జరుపుకోనున్న ఆర్‌ఎస్‌ఎస్ నూరేళ్ల ఉత్సవాల సందర్భంగా 'హిందూ రాష్ట్ర' ప్రకటనకు ఇదొక ముఖ్యమైన అడుగు. మానవత్వంపై ఆధారపడిన కొత్త రాజ్యాంగం వారి తక్షణ అవసరం కాదు.

భారతదేశం...యూదుల కోసం స్థాపించబడిన ఇజ్రాయిల్, ముస్లింల కోసం స్థాపించబడిన పాకిస్తాన్‌ల మాదిరిగా కాదు. ఇది భిన్నమైన దేశం. భారతదేశం అనేది ఒక మతం ఆధారంగా లేదా ఆ మతానికి చెందిన వారి కోసం అభివృద్ధి చేయబడిన భావన కాదు. ఈ కారణంగానే 'హిందూస్థాన్' అనే పేరు కూడా రాజ్యాంగ నిర్మాతలకు ఆమోదయోగ్యం కాలేదు. భారతదేశానికి అందరినీ కలుపుకుపోయే సంప్రదాయం వుంది. అయితే దానికి విరుద్ధమైన నిర్ణయం తీసుకున్నప్పుడు...అది రాజ్యాంగం, సంప్రదాయం, చరిత్ర పట్ల వివక్షగా మారుతుంది. పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకించడానికి ఇదే ప్రధాన కారణం.

ఈ కొత్త చట్టం భారతదేశంలోని ముస్లింల పౌరసత్వాన్ని తీసివేసేందుకు ఉద్దేశించినదని ఎవరూ ఆందోళన చెందరు. అయితే కొందరి పౌరసత్వాన్ని తీసివేయడానికి కాదుగానీ కొందరికి పౌరసత్వాన్ని ఇవ్వకూడదని ఈ చట్టం చేశారు. దేశంలోని శరణార్థులు, వలసదారులకు షరతులతో కూడిన పౌరసత్వం మంజూరు చేసినప్పుడు వివక్షను ఆరోపించలేమని చట్టాన్ని ప్రతిపాదించిన వారంటున్నారు. అదేమంటే వారికి పౌరసత్వం లేదు కనుక అంటున్నారు. పాలకుల పరస్పర చర్యలు, లావాదేవీలలో వివక్ష ఉండరాదని రాజ్యాంగంలో ఉంది. ఆర్టికల్ 14 ప్రకారం, పౌరులు కాని వారిపై కూడా వివక్ష ఉండకూడదు.



రాజ్యాంగాన్ని చదవని వారు కూడా ముస్లిమేతర శరణార్థులకు పౌరసత్వం కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పగలరు. సుప్రీంకోర్టు అందుకు భిన్నమైన వైఖరిని తీసుకోదు. దీనికి సంబంధించి కోర్టులో దాదాపు 250 పిటిషన్లు అపరిష్కృతంగా పడివున్నాయి. మత ప్రాతిపదికన పౌరసత్వాన్ని మంజూరు చేయడం లేదా తిరస్కరించడం రాజ్యాంగ స్ఫూర్తికి, భారతదేశ స్ఫూర్తికి అనుగుణంగా లేదు. న్యాయ సమీక్ష ప్రత్యేక అధికారాన్ని ఉపయోగించడం ద్వారా రాజ్యాంగ ప్రాథమిక స్వభావానికి విరుద్ధంగా ఉన్న చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేయవచ్చు.

రాజ్యాంగాన్ని చదవని వారు కూడా ముస్లిమేతర శరణార్థులకు పౌరసత్వం కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పగలరు. సుప్రీంకోర్టు అందుకు భిన్నమైన వైఖరిని తీసుకోదు. దీనికి సంబంధించి కోర్టులో దాదాపు 250 పిటిషన్లు అపరిష్కృతంగా పడివున్నాయి. మత ప్రాతిపదికన పౌరసత్వాన్ని మంజూరు చేయడం లేదా తిరస్కరించడం రాజ్యాంగ స్ఫూర్తికి, భారతదేశ స్ఫూర్తికి అనుగుణంగా లేదు. న్యాయ సమీక్ష ప్రత్యేక అధికారాన్ని ఉపయోగించడం ద్వారా రాజ్యాంగ ప్రాథమిక స్వభావానికి విరుద్ధంగా ఉన్న చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేయవచ్చు. సుప్రీంకోర్టు ఈ అధికారాన్ని ఈ కేసులో కాకపోయినా మరొక కేసులో అయినా ఉపయోగించాలి.

ఈ విషయమై కోర్టు జోక్యమే కాకుండా ప్రజల స్పందన కూడా బలంగా ఉంది. ప్రజాస్వామ్యంలో నిరసనలను క్రూరంగా అణచివేయడం కుదరదు. ఐక్యరాజ్యసమితి లేదా యూరోపియన్ యూనియన్ ఆమోదించలేని వివాదాస్పద చట్టంలో భారత పార్లమెంటు మతపరమైన ద్వేషాన్ని వ్యక్తం చేసింది. అయితే పౌరసత్వ సవరణ చట్టం గురించి కూడా బిబిసి డాక్యుమెంటరీలో ప్రధానంగా వచ్చింది. ఇది ప్రభుత్వాన్ని చికాకు పెట్టింది. సమస్యను ముస్లింలకే పరిమితం చేయడం ప్రమాదకరం. మతం ఆధారంగా వైస్రాయ్ కర్జన్ చేసిన బెంగాల్ విభజన చివరికి భారతదేశ విభజనకు దారితీసినట్లే, అమిత్ షా 'పౌరసత్వ సవరణ చట్టం' చాలా తీవ్రమైన పరిణామాలను కలిగి ఉంటుంది. లౌకిక సమాజం ఈ సవాలును స్వీకరించాలి. లౌకిక, గణతంత్ర అస్తిత్వాన్ని ప్రభావితం చేసే సమస్యను మత తీవ్రవాద ఉద్యమాలకు విడిచిపెట్టకూడదు. ఈ విషయంలో కేరళ మార్గదర్శకంగా నిలిచింది. అపూర్వమైన పరిస్థితులు అపూర్వమైన ప్రతిస్పందనను కోరుతున్నాయి.

తర్వాత పొంచివున్న ముప్పు 'నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్' (ఎన్‌ఆర్‌సి). పౌరసత్వంలో మతపరమైన వివక్షకు అవకాశం లేనట్లయితే...రిజిస్టర్ నిర్మాణంలో రాజ్యాంగబద్ధంగా రూపొందించబడిన సూత్రం కూడా అమలులోకి వస్తుంది. దీన్ని పౌరసత్వ సవరణ చట్టం కంటే తీవ్రమైన అంశంగా తీసుకోవాలి. పౌరసత్వాన్ని నిర్ణయించే, నిలుపుకునే ప్రక్రియలో మతం ఒక అంశం కాకూడదు.


సుప్రీంకోర్టు పర్యవేక్షణలో అస్సాం కేంద్రంగా పౌరసత్వ రిజిస్టర్‌ను రూపొందించడం బిజెపికి ఏ మాత్రం సంతోషాన్ని ఇవ్వలేదు. 1.9 లక్షల మంది (జనాభాలో 6 శాతం) త్రిశంక్‌లో ఉన్నారు. వీరిలో గణనీయమైన సంఖ్యలో బంగ్లాదేశ్‌కు చెందిన బెంగాలీ హిందువులు ఉన్నారు. ఇక్కడ హిందువులను అంగీకరించి ముస్లింలను తిరస్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అస్సాంలో సమస్య మతం కాదు. 'వరాత' తెగ బెంగాలీలను జాబితా నుంచి తప్పించాలన్నారు. అవిభక్త అస్సాంలో 1960 నుంచి కొనసాగుతున్న సమస్య ఇది. ఈ కారణంగానే అస్సాం రాజకీయాలను మార్చివేసేలా పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. బయటి వారికి వసతి కల్పించేందుకు ఈశాన్య రాష్ట్రాలు సిద్ధంగా లేవు.

పుట్టిన భూమి, నివాస స్థలం ప్రాతిపదికగా రాజ్యాంగం పౌరసత్వాన్ని నిర్దేశిస్తున్నది. పౌరసత్వాన్ని పొందేందుకు చట్ట ప్రకారం అనేక షరతులున్నాయి. ఇందులో పొందుపరిచిన ఒక షరతు ఆధారంగానే సోనియా గాంధీ పౌరసత్వం పొందారు. పౌరసత్వం ఇవ్వడంలో ఏ సందర్భంలోనూ మతాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. అణగారిన, బహిష్కరించబడిన వారిని-తోటి మనుషులుగా ఆదరిద్దాం. ఎందుకంటే ఇక్కడ మతానికి స్థానం లేదు. మన రాజ్యాంగం ఏ మతాన్ని గుర్తించలేదు.

/ 'దేశాభిమాని' సౌజన్యంతో /

ఓ ముస్లిం ఇచ్చిన
'భారత్ మాతా కీ జై' నినాదం వదిలేసుకుంటారా?

- సంఘ పరివార్‌ను సూటిగా ప్రశ్నించిన విజయన్



తిరువనంతపురం : 'భారత్ మాతా కీ జై', 'జై హింద్' నినాదాలు మొదటగా చేసింది ఇద్దరు ముస్లింలని, ఇప్పుడు ఆ నినాదాలను సంఘ పరివార్ వదిలేస్తుందా అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రశ్నించారు. ఉత్తర కేరళ లో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం పాలకులు, సాంస్కృతిక ప్రముఖులు, అధికారులు గణనీయ పాత్ర పోషించారన్నారు. ఇందుకు సంబంధించి చరిత్రలో అనేక ఉదాహరణలున్నాయని అన్నారు. అజిముల్లా ఖాన్ అనే ముస్లిం తొలుత భారత్ మాతా కీ జై అనే నినాదాన్ని ఇచ్చారని ఆయన అన్నారు. "ఇక్కడకు వచ్చిన సంఘ పరివార్ నేతలు తమ ముందు కూర్చున్నవారిని చూసి భారత్ మాతా కీ జై అని నినదించమంటున్నారు. అసలు ఎవరు ఈ నినాదం ఇచ్చారు? ఈ నినాదం మొదట చేసింది ముస్లిం అని, ఆ వ్యక్తి పేరు అజిముల్లా ఖాన్ అని సంఘ పరివార్‌కు తెలుసో లేదో నాకు తెలియదు." అని విజయన్ వ్యాఖ్యానించారు. ముస్లిం అని తెలిస్తే వారు ఈ నినాదం చేయడం ఆపేస్తారేమోనని వ్యంగ్యంగా అన్నారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ) వ్యతిరేకిస్తూ సిపిఎం నిర్వహిస్తున్న ర్యాలీల్లో నాల్గవది సోమవారం నాడిక్కడ జరిగింది. ఈ ర్యాలీ నుద్దేశించి ముఖ్యమంత్రి విజయన్ మాట్లాడుతూ, 'జై హింద్' అన్న నినాదాన్ని మొట్టమొదట ఇచ్చింది అబిద్ హసన్ అనే ప్రముఖ దౌత్యవేత్త అన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. మొఘల్ పాలకుడు షాజహాన్ కుమారుడు దారా షికోహ్ 50 ఉపనిషత్తులను సంస్కృతంలో నుండి పర్షియన్ భాషలోకి అనువాదం చేశారని, ప్రపంచవ్యాప్తంగా వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేశారని విజయన్ పేర్కొన్నారు. ముస్లింలు భారత్ నుండి పాకిస్తాన్‌కు వెళ్ళిపోవాలని నినదిస్తున్న సంఘ పరివార్ నేతలు, కార్యకర్తలందరూ ఈ చారిత్రక నేపథ్యం గురించి తెలుసుకోవాలన్నారు. ఇతరులందరితో కలిసి ముస్లింలు కూడా ఈ దేశ స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించారని విజయన్ గుర్తు చేశారు.

త్రిపుర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో
'సేవ్ ది కానిస్టిట్యూషన్' ప్యానెల్ విజయం


- మితవాదులకు పరాజయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

త్రిపుర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో సిపిఎం, కాంగ్రెస్ మద్దతు ఉన్న 'సేవ్ ది కానిస్టిట్యూషన్' ప్యానెల్ ఘన విజయం సాధించింది. బార్ కౌన్సిల్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి స్థానాలకు వరుసగా మృణాల్ కాంతి బిశ్వాస్, సుబ్రత దేబ్‌నాథ్, కౌశిక్ ఇందు ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా అమర్ దెబ్బర్మ, ఉత్పల్ దాస్ ఎన్నికయ్యారు. ఈఎన్నికల్లో బిజెపి మద్దతు కలిగిన మితవాద ప్యానెల్ పరాజయం పాలైంది. మొత్తం 500 మంది ఓటర్లకు గాను 463 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. . మాజీ ముఖ్యమంత్రి, న్యాయవాది సమీర్ రంజన్ బర్మన్, న్యాయవాది శంపా దాస్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నవారిలో ఉన్నారని రిటర్నింగ్ అధికారి సందీప్ దత్తా చౌదరి తెలిపారు. త్రిపుర ప్రతిపక్ష నేత, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి సేవ్ కానిస్టిట్యూషన్ ఫోరమ్‌ను ఈ సందర్భంగా అభినందించారు. దీనిని కేవలం ఐదు వందల మంది న్యాయవాదుల ఎన్నికగా మాత్రమే చూడరాదు, మన రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్న మతోన్మాద బిజెపిపై ఆలోచనా పరులు ఆగ్రహంగా ఉన్నారనడానికి ఇది సంకేతం అన్నారు. ఈ ఎన్నిక ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో లౌకిక, ప్రజాతంత్ర శక్తులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. బార్ కౌన్సిల్ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సభ్యుడు సుదీప్ రాయ్ బర్మన్ హర్షం వ్యక్తం చేశారు. బిజెపి, ఆరెస్సెస్ బారి నుంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని ఈ తీర్పు తెలియజేస్తోందని అన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యత

- విద్వేష రాజకీయాలను విద్యార్థులు తిప్పికొట్టారు
- జెఎన్‌యు విద్యార్థి సంఘం అధ్యక్షుడు ధనంజయ్



న్యూఢిల్లీ : జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యు) విద్యార్థి సంఘానికి జరిగిన ఎన్నికల్లో వామపక్ష కూటమి క్లీన్‌స్వీప్ చేసిన విషయం తెలిసిందే. సెంట్రల్ ప్యానల్‌లోని మొత్తం నాలుగు స్థానాలూ ఈ కూటమికే దక్కాయి. జెఎన్‌యు విద్యార్థి సంఘానికి అధ్యక్షుడుగా ఎన్నికైన ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎస్‌ఎ) నేత ధనంజయ్ బీహార్‌లోని గయకు చెందినవారు. 1996-97లో గెలుపొందిన బట్టిలాల్ బైర్వా తర్వాత వామపక్ష కూటమి నుంచి విజయం సాధించిన తొలి దళిత అధ్యక్షుడు ఆయనే. ధనంజయ్ పిటిఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ విద్వేష, హింస రాజకీయాలను జెఎన్‌యు విద్యార్థులు తిరస్కరించారని చెప్పారు. వారు తమపై మరోసారి విశ్వాసాన్ని ఉంచారని, దానిని నిలబెట్టుకుంటామని, వారి హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని, విద్యార్థులకు సంబంధించిన అంశాలపై కృషి చేస్తామని తెలిపారు. 'క్యాంపస్‌లో మహిళల భద్రత, నిధుల కోత, స్కాలర్‌షిప్పుల పెంపు, మౌలిక సదుపాయాలు, నీటి సంక్షోభం వంటి సమస్యలపై విద్యార్థి సంఘం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. ఆయా సమస్యల పరిష్కారానికి ముందుగా చర్యలు చేపడతాం' అని ధనంజయ్ చెప్పారు. తాజా విజయంతో జెఎన్‌యు వామపక్షాలకు కంచుకోట అని మరోసారి రుజువైంది. యునైటెడ్ లెఫ్ట్ ప్యానల్‌లో ఏఐఎస్‌ఏ, డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్, ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ భాగస్వాములుగా ఉన్నాయి. గత 12 సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా ఈ ఎన్నికల్లో 73% ఓట్లు పోలయ్యాయి. 2019లో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐకి చెందిన అయిషీ ఘోష్ అధ్యక్షులుగా విజయం సాధించిన విషయం తెలిసిందే.



తీర్మానంపై ఓటింగ్‌కు గైర్హాజరు కావడానికి ముందు ఐరాసలో అమెరికా ప్రతినిధి లిండా థామస్ గ్రీన్‌ఫీల్డ్

భద్రతా మండలి తీర్మానంపై
అరబ్బు దేశాల హర్షం

న్యూయార్క్: రంజాన్ సందర్భంగా 'తక్షణ కాల్పుల విరమణ' డిమాండ్ చేస్తూ భద్రతా మండలి మొదటిసారి తీర్మానాన్ని ఆమోదించడం పట్ల అరబ్బు దేశాలు హర్షం వ్యక్తం చేశాయి. శాశ్వత కాల్పుల విరమణ దిశగా వేసిన మొదటి అడుగుగా యెమెన్ దీనిని అభివర్ణించింది. అరబ్ గ్రూప్ తరపున యెమెన్ ప్రతినిధి అబ్దుల్లా అలీ ఫదేల్ అల్-సాదీ మాట్లాడుతూ , తీర్మానానికి మద్దతు ఇస్తున్న 14 దేశాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శాశ్వత కాల్పుల విరమణపై కట్టుబడి తీర్మానానికి దారితీసే తొలి అడుగుగా ఈ తీర్మానాన్ని పరిగణించాలని ఆయన అన్నారు. ఇజ్రాయెల్ దురాక్రమణదారులు తమ మారణహోమ యుద్ధాన్ని కొనసాగిస్తూ, స్త్రీలు మరియు పిల్లలను లక్ష్యంగా చేసుకుని దాడులు సాగిస్తున్నాయి. ఆహార ప్యాకెట్ల కోసం ట్రక్కుల వద్ద బారులు తీరిన వారిని కూడా కాల్చి చంపిన ఇజ్రాయిల్ అమానుష చర్యను ఆయన ఖండించారు. జెరూసలేం సహా పాలస్తీనియన్లపై హింసను ప్రేరేపిస్తున్న ఇజ్రాయెల్ సెటిలర్లపై కఠిన ఆంక్షలు విధించాలని కౌన్సిల్‌కు పిలుపునిచ్చారు. ఈ యుద్ధ నేరాలకు ఇజ్రాయెల్‌ను జవాబుదారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గాజాలో గత 24గంటల్లో 50మంది పాలస్తీనియన్లు మృతి

గాజా పై ఇజ్రాయిల్ తాజాగా జరిపిన దాడిలో 50మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. సెంట్రల్ గాజాలోని డేర్ అల్ బాలాహ్ ప్రాంతంలో ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిలో 22మంది చనిపోగా, రఫా నగరంలో మరో 30మంది మరణించారు. ఇప్పటికే దాడుల్లో చాలా భాగం ధ్వంసమైన అల్ షిఫా ఆస్పత్రిని ఇజ్రాయిల్ బలగాలు దిగ్బంధించగా అక్కడ నుండి పారిపోయిన పాలస్తీనియన్లు ఆ దారుణ పరిస్థితులను గుర్తు చేసుకుని భయ కంపితులవుతున్నారు. ఇజ్రాయిల్ ట్యాంకులు, సాయుధ బుల్డోజర్లు నాలుగు మృత దేహాలను తొక్కుకుంటూ అంబులెన్సులు వెళ్లాయని వారు చెప్పారు. రఫా నగరంలో ప్రతి క్షణమూ బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోందని అక్కడి ప్రజలు వాపోయారు. దక్షిణ గాజాలోని అల్ అమల్, నాసర్ ఆస్పత్రులపైనా ఇజ్రాయిల్ బలగాలు దాడి చేశాయి. ఉత్తర గాజాలోకి ఐక్యరాజ్య సమితి ఆహార బృందాలను అనుమతించేది లేదని ఇజ్రాయిల్ హూంకరించింది. ఉత్తర గాజాలో ఇప్పటికే 70శాతానికిపైగా ప్రజలు తీవ్రమైన ఆహార కొరతతో ఇబ్బంది పడుతున్నట్లు ఐరాస చీఫ్ ఆంటోనియో గుటెరస్ పేర్కొన్నారు. గతేడాది అక్టోబరు నుండి ఇజ్రాయిల్ విచక్షణారహితంగా జరుపుతున్న యుద్ధంలో ఇప్పటివరకు 32,333మంది మరణించగా, 74,694మంది గాయపడ్డారు.

జైలు నుంచి కేజ్రీవాల్ ఆదేశాలపై ఇడి విచారణ

న్యూఢిల్లీ : జైలు నుంచి ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ జారీ చేసినట్లు చెబుతున్న ఉత్తర్వులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దృష్టి పెట్టింది. ఒకవేళ కేజ్రీవాల్ ఈ ఉత్తర్వులను జారీ చేస్తే అవి ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఎ) ప్రత్యేక కోర్టు ఇడికి, కేజ్రీవాల్‌కు ఇచ్చిన ఆదేశాలకు లోబడి ఉన్నాయా.. లేదా అనే విషయంపై విచారణ చేయనుంది.

ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో 55 ఏళ్ల కేజ్రీవాల్‌ను ఈ నెల 21న ఇడి అరెస్టు చేసింది. కోర్టు ఈ నెల 28 వరకూ కేజ్రీవాల్‌కు కస్టడీ విధించింది. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకూ మధ్యలో అరగంట పాటు భార్య సునీతా కేజ్రీవాల్, వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్‌ను కలవడానికి కేజ్రీవాల్‌కు అనుమతి ఇచ్చింది. మరో అరగంట పాటు తన న్యాయవాదులను కలవడానికి అనుమతి ఇచ్చింది. కస్టడీలో ఉన్న ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తనకు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఢిల్లీ నీటి పారుదల శాఖ మంత్రి అతిషి ఆదివారం ప్రకటించారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో ఎదురువుతున్న నీటి, మురుగు నీటి సంబంధిత సమస్యలను పరిష్కరించాలని ఆదేశిస్తూ ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు.

మహాకాళేశ్వర్ ఆలయంలో అగ్నిప్రమాదం

- 14 మందికి గాయాలు

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో ఉన్న మహాకాళేశ్వర్ ఆలయంలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పూజారులతో సహా 14 మంది గాయపడ్డారు. భస్మ హారతి సందర్భంగా ఈ ప్రమాదం జరిగిందని ఉజ్జయిని జిల్లా కలెక్టర్ నీరజ్ కుమార్ సింగ్ తెలిపారు. హోళీని నిర్వహించుకోవడానికి రంగుపొడిని విసురుతుండగా అది నేలపై పడి మంటలు వ్యాపించినట్లు చెప్పారు. ప్రమాదంలో 14 మంది గాయపడ్డారని, వారిని వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించామని తెలిపారు. వీరిలో ఎనిమిది మందిని మెరుగైన చికిత్స కోసం ఇండోర్‌కు తరలించినట్లు చెప్పారు.





మీ కోసం

సెగగడ్డలు వచ్చినప్పుడు బియ్యం పిండిని నీటిలో ఉడికించి, కాస్త వేడిగా ఉన్నప్పుడే ఆ గడ్డపై ఉంచి కట్టుకడితే అది త్వరగా చితికిపోయి సమస్య పరిష్కారమవుతుంది.

జీవన సౌరభం

శక్తిమంతులుగా చేసే ప్రతి ఆశయాన్నీ స్వీకరించాలి. బలహీనపరిచే ప్రతి ఆలోచననూ తిరస్కరించాలి.


ఎందుకని?

ఎండలు మండేది ఎందుకని?
మెండుగా మొక్కలు నాటమని
సెగలు కక్కేది ఎందుకని?
పగలు, ప్రతీకారం వద్దని
వడ గాలులు వీచేది ఎందుకని?
అడవుల శాతమే పెంచాలని

భానుని భగ భగ లెందుకని?
కానలు నిరతం కాపాడమని
చెరువులు ఎండేది ఎందుకని?
కరువుకు మేమే సాక్ష్యమని
పండుటాకులు చెప్పేది ఏమని?
నిండుగా ఎపుడూ ఉండాలని ...



- గుండాల నరేంద్రబాబు,
తెలుగు సాహిత్య పరిశోధకులు,
శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.



నీడను కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ రకరకాల ఆకుల బొమ్మలు ఇచ్చాం. వాటి నీడలు కింది వరుసలో గజిబిజిగా ఉన్నాయి. సరైన నీడను కనిపెట్టండి.

నేను గీసిన బొమ్మ




సాతివల్లి మాధురి లక్ష్మి,
4వ తరగతి,
శ్రీ తిమ్మరాజు ప్రాథమిక పాఠశాల,
పశ్చిమ గోదావరి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అమ్మా నాన్నా ఆలోచించండి..

భార్యభర్త ఇద్దరూ కలిసి సంపాదిస్తే గాని రోజులు గడవడం లేదు. పొద్దున్న నుండి రాత్రి వరకు ఉరుకులు పరుగుల జీవితంలో పడి చాలా మంది తల్లిదండ్రులు పిల్లల ఆలనాపాలనను అశ్రద్ధ చేస్తున్నారు. బిడ్డల సంరక్షణ తల్లిదండ్రులిద్దరిదీ. ఇద్దరూ పని ఒత్తిడితో సతమతమయ్యేటప్పుడు పిల్లల బాధ్యత ఒకరి మీద ఒకరు నెట్టివేసుకోకుండా సమంగా పంచుకోవాలి. అప్పుడే పిల్లలు సక్రమంగా తీర్చిదిద్దబడతారు.



బాధ్యత అంటే వారికి స్కూలుకు పంపించడం, వేళకి అన్నం తినిపించడం, స్నానం చేయించడం, బట్టలు తొడగడం మాత్రమే కాదు. వారి భావోద్వేగాలు పట్టించుకోవడం. మంచి, చెడుల విశ్లేషణలను తెలియజేయడం. చాలా మంది ఇళ్లల్లో పిల్లల పెంపకం భాగస్వాములు ఇద్దరిలో ఎవరిదో ఒకరిదే అన్నట్లు వ్యవహరిస్తారు. కానీ, ఇద్దరూ సమాన బాధ్యతగా వ్యవహరించాలి.

ఎదుగుతున్న పిల్లల ముందు చీటికీమాటికీ తగాదాలు పడడం, ఇతరుల గురించి అవమానంగా మాట్లాడుకోవడం, ఇంటికి వచ్చిన వారు వెళ్లిపోయాక వారి గురించి చెడ్డగా మాట్లాడడం చాలామంది ఇళ్లల్లో చూస్తుంటాం. ఆ వాతావరణంలో పెరుగుతున్న పిల్లలు కూడా అదే ఒరవడి కొనసాగిస్తారు. స్నేహితులతో, బంధువులతో సజావుగా మెలగడం మానేసి విభిన్నంగా వ్యవహరిస్తుంటారు. అది వారి భవిష్యత్తుకు మంచిది కాదు.

సమాజ నిర్మాణంలో పిల్లలను భాగస్వామ్యం చెయ్యాలన్న స్పృహ ఉండేది చాలా కొద్దిమంది తల్లిదండ్రులకే. పిల్లలకు సొంత ఆలోచనలు, కోరికలు ఉంటాయి. వాటికి విలువ ఇవ్వాలి. పిల్లల చుట్టూ స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలి. స్వేచ్ఛ అంటే విశృంఖలత్వం కాదు.. వారి అభిప్రాయాలు, అభిరుచులు నిస్పష్టంగా చెప్పుకునే అవకాశం.

చాలామంది తల్లిదండ్రులు పిల్లల వ్యక్తిత్వ వికాసం గురించి అసలు మాట్లాడరు. ఆ మాటకు అర్థం కూడా తెలియని వారుంటారు. పిల్లలను వ్యక్తిత్వ వికాస కేంద్రాలుగా చూడాలి. వారి చుట్టూ మనం కల్పించే సాదృశ్య వాతావరణమే వారిని సమాజ నిర్మాతలుగా తీర్చిదిద్దుతుంది. ఆ ప్రక్రియలో తల్లిదండ్రులు కీలక భాగస్వామ్యం పోషించాలి. స్నేహితులతో, బంధువులతో సఖ్యతగా మెలిగేలా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

పిల్లలు సక్రమంగా పెరిగితే తల్లిదండ్రులను కీర్తించే సమాజం, వారు పెడదోవ పడితే నిందిస్తుంది కూడా. అందుకే ఇకనైనా మీ బిజీ లైఫ్‌లో కొంత సమయం కచ్చితంగా పిల్లల కోసం కేటాయించాలి. ఒకరు, ఇద్దరు పిల్లలున్న ఇంట్లో తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలకు వెళితే నాలుగ్గోడల మధ్య ఆ పిల్లలు ఒంటరి జీవితం గడుపుతున్నారు. ఒకప్పుడంటే అమ్మమ్మ, తాతయ్య, నానమ్మలు ఉండేవారు. బాబాయి, పిన్ని, పెదనాన్న, పెద్దమ్మ, అత్తయ్య, మామయ్య పిల్లలతో పండగలు, వేడుకలు కలిసి జరుపుకునేవారు. కాని ఇప్పటికాలం పిల్లలకి అవేమీ తెలియడం లేదు. ఆప్యాయతలు కొరవడుతున్నాయి. అక్కాచెల్లెళ్లు, అన్నాదమ్ముల అనుబంధం అర్థం కావడం లేదు.

'పిల్లలు ఏది కావాలంటే అది చేస్తున్నాం. ఏమి అడిగితే అది ఇచ్చేస్తున్నాం' పిల్లల పట్ల మా బాధ్యత ఇదే అనుకునే తల్లిదండ్రులు.. ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. సమయం దొరికినప్పుడల్లా పిల్లలతో సామాజిక అంశాలపై చర్చించాలి. వారి చుట్టూ పెనవేసుకున్న మూఢనమ్మకాలను పారద్రోలేలా వ్యవహరించాలి. శాస్త్రీయ ఆలోచనల వైపు మళ్లించాలి. పిల్లల ఆలోచనల్లో ఎప్పుడూ కుల మత భేదాలు రానీయకూడదు. స్నేహం, సౌభ్రాతృత్వంతో పిల్లలు పెరిగేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ఆడపిల్లలున్న తల్లిదండ్రులు ఆ పిల్లలను ఆత్మవిశ్వాసంతో పెరిగేలా చేయాలి. పిరికితనం నూరిపోయొద్దు. అలాగే మగపిల్లలు ఉన్న అమ్మానాన్న ఆ పిల్లలకు ఆడపిల్లలను గౌరవించడం నేర్పాలి. మంచి అలవాట్లు చెప్పాలి. చెడ్డ అలవాట్ల వల్ల కలిగే దుష్పరిణామాలను తెలియజేయాలి. ఇక ఆడ, మగ పిల్లలున్న ఇళ్లల్లో ఒకరిపట్ల ఒకరు గౌరవంగా మెలిగేలా చూడాలి. భిన్న అభిప్రాయాలున్నప్పటికీ ఏకాభిప్రాయంతో ఎలా మెలగాలో నేర్పించాలి. ఇలా మీ ఇంటి పిల్లలను తీర్చిదిద్దితేనే సమాజం చైతన్యం అవుతుంది. ఎన్నో ఏళ్ల నుండి సమాజంలో నాటుకుపోయిన కుల, మత ఘర్షణలు, ఆడపిల్లలపై అకృత్యాలు, దాడులు కొంతవరకైనా తగ్గుతాయి.

పలు ప్రయోజనాల మునక్కాయ




వేసవిలో ఎక్కువగా లభించే కూరగాయల్లో మునక్కాయ ఒకటి. దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఇవి విరివిగా లభిస్తాయి. ఈ చెట్టు వేరు నుంచి ఆకుల వరకూ అన్నీ ఉపయోగాలే. పోషకాలు కూడా ఎక్కువే. మునగ కాయలే కాకుండా ఆకులు కూడా చాలా బలమైన ఆహారం. ఆకులు కంటే కాయలను ఎక్కువగా కూరల్లో వాడుతుంటారు. కాయలతోపాటు పుష్పాలు, బెరడు, వేరు వంటి అన్ని భాగాల్లో ఔషధ గుణాలున్నాయి. వీటిలో నీటిశాతం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల వేసవిలో జీర్ణక్రియ వేగంగా పనిచేయటానికి దోహదపడతాయి. విటమిన్ ఎ, సిలతోపాటు కాల్షియం, పొటాషియం పుష్కలంగా ఉంది. నిత్యజీవితంలో ఎదుర్కొనే అనేక వ్యాధులను తగ్గించే శక్తి మునగలో ఉంది. చాలావరకూ శారీరక రుగ్మతలు మునగ వల్ల నయమవుతాయి. ఆకును కూడా కూరగా వండుకుని తినొచ్చు. పచ్చటి ఆకులను కొంచెం నీడలో ఎండబెట్టి పొడిచేసి నిల్వ వుంచుకోవచ్చు. అవసరమైనప్పుడు ఏడాది పొడవునా వాడుకోవచ్చు. సి విటమిన్ తప్ప మిగిలిన పోషకాలేవీ నశించవు. వంద గ్రాముల ఆకుల్లో కాల్షియం 440 మిల్లీ గ్రాములు, ఇనుము 0.85 మి.గ్రా, బీటా కెరోటీన్లు అధికంగా ఉంటాయి. ఆయుర్వేద వైద్య విధానంలో ఈ మునగకాయలు, ఆకులు, పువ్వులు, కాండం అన్నింటిలోనూ ఔషధగుణాలు అధికంగా ఉండటంతో ఎక్కువమంది వినియోగిస్తుంటారు.

- మన శరీరానికి అవసరమయ్యే మోనో సాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్‌కు సంబంధించి హైఓలిక్ యాసిడ్‌ను కలిగివుంటాయి
- మునగకాడలో పుష్కలంగా ఉండే సి విటమిన్ అనేక ఇన్ఫెక్షన్లతో పోరాడే లక్షణాలుంటాయి.
- సీజనల్‌గా వచ్చే ముక్కు దిబ్బడ, చెవులు మూసుకుపోయినప్పుడు మునగకాడలను బాగా ఉడికించి ఆ నీటిని ఆవిరిగా పీల్చితే ఉపశమనం కల్గుతుంది. ఆస్తమాతోపాటుగా అనేక శ్వాస సంబంధిత సమస్యలు తగ్గుముఖం పడతాయి.
- కాల్షియం పుష్కలంగా ఉన్నందున ఎముకలను బలంగా ఉంచటానికి సహాయపడతాయి. ఐరన్ రక్తహీనత లేకుండా కాపాడుతుంది.
- మెగ్నీషియం, సెలీనియం, మ్యాంగనీస్ వంటివి ఆరోగ్యానికి సహాయపడతాయి.
- గర్భిణులకు నిస్సత్తువ, వాంతులు, తలతిరగటం నుంచి ఉపశమనం కల్గిస్తుంది. ప్రసవ నొప్పులు సులభంగా వచ్చేలా చేస్తుంది.
- ప్రసవం తర్వాత బిడ్డకు సరిపడా పాలు పడాలంటే మునగాకును తరచుగా తింటుండాలి.
- ఆకుల్లో ఉండే విటమిన్ బి6, సియాసిన్, రెబోఫ్లేవిన్, ఫోలిక్ యాసియాసిడ్లు జీర్ణ వ్యవస్థ మెరుగుపడేందుకు దోహదపడుతుంది. డయేరియా, డైసెంట్రీ, జాండీస్ వంటి వాటికి విరుగుడుగా ఉంటుంది.
- మునగాకు రసాన్ని తీసుకోవటం వల్ల శరీర అవయవాలకు రక్త సరఫరా బాగా ఉంటుంది. -సూప్‌లాగా తీసుకుంటే రక్తాన్ని శుభ్రం చేయటంతోపాటు మొటిమలు, మచ్చలను తగ్గిస్తుంది. యాంటీబయోటిక్‌గా పనిచేస్తుంది.
- మూత్రనాళాల్లో మంట, ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుంది.
- మునగ పువ్వులు, చిగుర్లు కూరగా వండుకని తింటే కీళ్ల జబ్బులు రావు.
- రక్తహీనత తగ్గి, హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది.
- ఎండబెట్టిన మునగాకు పొడిని తేనెతో కలిపి ప్రతిరోజూ భోజనానికి ముందు తీసుకుంటే అధిక బరువు తగ్గుతుంది.
- నెలసరి సక్రమంగా రానివారు, కాల్షియం తగ్గిన వారు చిన్న కప్పు పాలకు పెద్ద చెంచా మునగాకు రసం కలిపి రోజూ తీసుకుంటే సమస్యలు తగ్గుతాయి.

ఎలక్టోరల్ బాండ్స్ : రాష్ట్రంలో ఎవరికెంత?

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో కంపెనీల నుండి రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలకు నిధులు అందాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఇచ్చిన వివరాలను, కేంద్ర ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో పొందుపరిచిన వివరాల ప్రకారంఅధికారంలో ఉన్న వైసిపికి అత్యధికంగా 337కోట్ల రూపాయలను కంపెనీలు ఇవ్వగా, ఆ తరువాత తెలుగుదేశం పార్టీకి 218.88 కోట్ల రూపాయలు అందాయి. గత ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవని జనసేనకు 21 కోట్ల రూపాయలను కంపెనీలు ఇచ్చాయి. వైసిపి ప్రభుత్వ హయంలో పెద్ద ఎత్తున లబ్ధిపొందిందని టిడిపి పదేపదే ఆరోపించిన షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ సంస్థ తనపై ఆరోపణలు చేసిన తెలుగుదేశం పార్టీకే ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో నిధులు అందిచడం విశేషం. ఆ సంస్థ నుండి టిడిపి 40 కోట్ల రూపాయలు అందాయి. రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల పనులు చేస్తున్న మేఘా సంస్థ వైసిపి, టిడిపి, జనసేన మూడు పార్టీలకు ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో నిధులు ఇచ్చింది. బిజెపికి పెద్ద మొత్తంలో నిధులు ఇచ్చిన ఫ్యూచర్ గేమింగ్ సంస్థ రాష్ట్రంలో వైసిపికి 154 కోట్ల రూపాయలు అందించింది. అదానికి చెందిన గ్రీన్ కో విండ్ నుండి కూడా వైసిపికి 10 కోట్ల రూపాయలు అందాయి, వైసిపికి 472 బాండ్ల రూపంలో, టిడిపికి 279 బాండ్ల రూపంలో. జనసేనకు 39 బాండ్లతో ఈ నిధులు సమకూరనాయి.

వైసిపికి ఇచ్చిన కంపెనీలు

వైసిపికి 472 బాండ్ల రూపంలో రూ.337 కోట్లు విరాళాలు వచ్చాయి. అలాగే గుర్తు తెలియని వ్యక్తులు, సంస్థల నుంచి 24 బాండ్లు వచ్చాయి. అవన్నీ ఏప్రిల్ 2019లో కొనగా, గుర్తు తెలియని బాండ్ల నుంచి రూ.8.25 కోట్లు వచ్చాయి. కోటి కంటే తక్కువ విరాళాలు ఇచ్చిన సంస్థలు, వ్యక్తులు 124 ఎంట్రీలు ఉన్నాయి.

సంస్థ	మొత్తం (రూ.కోట్లలో)
1. ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ కంపెనీ	154
2. మేఘా	37
3. రామ్‌కో	24
4. స్నేహ కైనెటిక్ పవర్	10
5. గ్రీన్ కో విండ్	10
6. స్కీరాన్ రెన్యువబుల్ ఎనర్జీ	7
7. ఫ్యూచరిస్టిక్ హ్యాండ్లింగ్	5
8. ఎవర్ షైన్ ఇంటీరియర్స్ చెన్నై	5
9. తానోత్ విండ్ పవర్, తాడాస్ విండ్ ఎనర్జీ	4
10. నాట్కో ఫార్మా	3
11. ఎస్ఇఐ డైమండ్స్, ఎస్ఇఐ ఆరుషి	3
12.. యాక్సిస్ విండ్	3
13. దివ్యేశ్ పవర్	3
14. ఎలెనా రెన్యువబుల్	3
15. ఖండ్కే విండ్ ఎనర్జీ	2
16. ఆరిష్ సోలార్	2
17. అనిమల విండ్	2
18. దేవర వింఢ	2
19. సేన్ గుప్త అండ్ సేన్ గుప్త కంపెనీ	1.40
20. హిమాలయన్ ఎండీవర్	1.40
21. శ్రేయస్ రెన్యువబుల్ ఎనర్జీ	1
22 ఆష్మాన్ ఎనర్జీ	1
23.. అచింత్య సోలార్	1

టిడిపికి ఇలా...

టిడిపికి 279 బాండ్ల రూపంలో రూ.218 కోట్లు విరాళాలు వచ్చాయి. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి 2019 ఏప్రిల్‌లో 19 బాండ్లు రూపంలో రూ.7.30 కోట్ల విరాళాలు వచ్చాయి. రూ.ఒక కోటి కంటే తక్కువ విరాళాలు వచ్చినవి 32 ఎంట్రీలు ఉన్నాయి. బిజెపి ఎంపి సిఎం రమేష్ కంపెనీ రిత్విక్ ప్రాజెక్టు నుంచి టిడిపికి విరాళాలు అందాయి.

కంపెనీ	మొత్తం (రూ.కోట్లలో)	కంపెనీ	మొత్తం (రూ.కోట్లలో)
1 షిర్డి సాయి ఎలక్ట్రికల్స్	40	17. శ్రీచైతన్య స్టూడెంట్ ఫెసిలిటీ	5
2.. మేఘా	28	18. కంచర్ల సుధాకర్	5
3. వెస్టర్న్ యుపి పవం	20	19. గ్రాన్యుల్స్ ఇండియా	3
4. నాట్కో ఫార్మా	14	20. అరవిందో ఫార్మా	2.5
5. డాక్టర్ రెడ్డీస్	13	21. టెక్రియంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్	2
6. భారత్ బయోటెక్	10	22. ఎఐసి విఎంఆర్	2
7. బయోవెట్	5	23. ఎఫిసెన్స్ సాఫ్టువేర్	2
8. సిఆర్ అసోసియేట్స్	5	24. క్రుతి వెంచర్స్	2
9. చిరాన్ బెహ్రింగ్ వ్యాక్సిన్స్	5	25. అమరావతి టెక్ సిస్టమ్స్	2
10. ఎన్ఎఆర్ ఇన్‌ఫ్రా	5	26. ఎస్ఎల్ఆర్వీ	2
11. ట్రైడెంట్ కెంఫార్ లిమిటెడ్	5	27. సోమశిల సోలార్ పవర్	2
12. రాంకో సిమెంట్స్	5	28. విహాన్ ఆటో వెంచర్స్	2
13. ఆర్సీసి న్యూట్రాఫిల్	5	29. స్లిక్ సాఫ్ట్‌వేర్	1
14. రిత్విక్ ప్రాజెక్ట్స్	5	30. శ్రీరాయలసీమ హై స్ట్రెంత్ హైపో	1
15. ఎస్ఇపిసి పవర్	రూ. 5	31. శ్రీ సిద్ధార్థ ఇన్ఫ్రాటెక్	1
16. మాత ప్రాజెక్ట్స్	రూ. 5	32. సాగర్ సిమెంట్స్	50

జనసేనకు వచ్చిన విరాళాలు

జనసేనకు 39 బాండ్లతో రూ.21 కోట్లు వచ్చాయి. జనసేనకు ఒకే కంపెనీ నుంచి రూ.10 కోట్లు అందాయి.

కంపెనీ	మొత్తం (రూ.కోట్లలో)
1. వెస్టన్ యుపి పవర్ ట్రాన్స్‌మిషన్	10
2. నాట్కో ఫార్మా	5
3. మేఘా ఇంజినీరింగ్ కంపెనీ	4
4. శ్రీ చైతన్య స్టూడెంట్స్ ఫెసిలిటీ మేనేజ్‌మెంటు ప్రైవేట్ లిమిటెడ్	1
5. వల్లూరిపల్లి ప్రభు కిశోర్-	1

చెన్నైలో టైటిల్ పోరు

- మే 26న ఐపిఎల్17 ఫైనల్
- పూర్తి షెడ్యూల్ విడుదల చేసిన బిసిసిఐ

ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) 2024 పూర్తి షెడ్యూల్ వచ్చేసింది. మార్చి 22న చెపాక్‌లో మొదలైన ఐపిఎల్ 17 సీజన్.. మే 26న చెపాక్‌లోనే టైటిల్ పోరుతో ముగియనుంది. సుమారు 12 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత చెన్నైలోని ఎంఎ చిదంబరం స్టేడియం ఐపిఎల్ టైటిల్ పోరుకు ఆతిథ్యం ఇవ్వనుంది. 2011, 2012 ఐపిఎల్ ఫైనల్స్‌కు వేదికగా నిలిచిన చెపాక్ మళ్లీ తుది పోరుకు ఆతిథ్యం ఇవ్వలేదు. ఫైనల్‌తో పాటు మే 24న రెండో క్వాలిఫయర్‌కు చెన్నై వేదిక కానుంది. తొలి క్వాలిఫయర్ మే 21న జరగనుండగా, ఎలిమినేటర్ మే 22న జరుగుతుంది. ఈ రెండు మ్యాచ్‌లకు అహ్మదాబాద్‌లోని మొతెరా మైదానం వేదిక కానుంది. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో భద్రతపరంగా సమస్యలు ఎదురుకాకుండా.. ర్వాహకులు సోమవారం ఐపిఎల్ పూర్తి షెడ్యూల్ విడుదల చేశారు. తొలి దశ షెడ్యూల్లో 17 రోజుల్లో 21 మ్యాచ్‌లు షెడ్యూల్ చేయగా.. తాజా షెడ్యూల్‌లో ప్లే ఆఫ్స్ సహా 52 మ్యాచ్‌లు చోటుచేసుకున్నాయి.

రెండు గ్రూపులుగా : ఐపిఎల్ ఫార్మెట్ గత సీజన్ మాదిరిగానే ఉంది. లీగ్‌లో పోటీపడుతున్న పది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో ఐదేసి జట్లు ఉన్నాయి. గ్రూప్-ఎలో ఐదుసార్లు ఛాంపియన్ ముంబయి ఇండియన్స్, మాజీ ఛాంపియన్లు రాజస్థాన్ రాయల్స్, కోల్‌కత నైట్‌రైడర్స్ సహా ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్‌జెయింట్స్ ఉన్నాయి. గ్రూప్-బిలో ఐదుసార్లు టైటిల్ విజేత, డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్, మాజీ ఛాంపియన్లు సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ సహా రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, పంజాబ్ కింగ్స్ ఉన్నాయి. ప్రతి జట్టు తమ గ్రూప్‌లోని ఇతర నాలుగు జట్లతో రెండు మ్యాచ్‌ల్లో ఇంటా, బయటా ఫార్మాట్‌లో ఆడుతుంది. ఇతర గ్రూప్‌లోని నాలుగు జట్లతో ఓ మ్యాచ్‌లో ఢీకొంటుంది. డ్రా ప్రకారం ఇతర గ్రూప్‌లోని మరో జట్టుతో రెండు సార్లు తలపడనుంది. దీంతో ప్రతి జట్టు గ్రూప్ దశలో 14 మ్యాచ్‌ల్లో తలపడనుంది. గ్రూప్ దశ మ్యాచ్‌ల అనంతరం టాప్-4లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. టాప్-2లో నిలిచిన జట్లకు ఫైనల్‌కు చేరుకునేందుకు రెండు అవకాశాలు ఉండగా.. 3, 4వ స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్స్‌లో చావోరేవో తేల్చుకోవాల్సి ఉంటుంది.

ఐపీఎల్ 2024 గ్రూపులు

గ్రూప్-ఏ	గ్రూప్-బి
ఢిల్లీ క్యాపిటల్స్	చెన్నై సూపర్‌కింగ్స్
కోల్‌కత నైట్‌రైడర్స్	గుజరాత్ టైటాన్స్
లక్నో సూపర్‌జెయింట్స్	పంజాబ్ కింగ్స్
ముంబయి ఇండియన్స్	రాయల్ చాలెంజర్స్ బెంగళూర్
రాజస్థాన్ రాయల్స్	సన్‌రైజర్స్ హైదరాబాద్



బెంగళూర్ బోణీ

- పంజాబ్ కింగ్స్‌పై ఆర్సీబి గెలుపు
- ఛేదనలో కోహ్లి, కార్తీక్ ధనాధన్
- పంజాబ్ కింగ్స్ 176/6,

బెంగళూర్ 178/6

బెంగళూర్ : రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ బోణీ కొట్టింది. ఐపిఎల్ 17 ఆరంభ మ్యాచ్‌లో ఓడిన ఆర్సీబీ.. సొంతగడ్డపై బలంగా పుంజుకుంది. 177 పరుగుల ఛేదనను 19.2 ఓవర్లలోనే ముగించిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఛేదనలో దినేశ్ కార్తీక్ (28 నాటౌట్, 10 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. విరాట్ కోహ్లి (77, 49 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సులు) అర్థ సెంచరీతో బెంగళూర్‌ను గెలుపు పట్టాలపై నడిపించాడు. మహిపాల్ లామ్రోర్ (17 నాటౌట్, 8 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఛేదనలో ఆర్సీబీ బ్యాటర్లు నిరాశపరిచారు. విరాట్ కోహ్లి ఒక్కడే నిలువగా.. మరో ఎండ్ నుంచి సహకారం లభించలేదు. డుప్లెసిస్ (3), కామెరూన్ గ్రీన్ (3), రజత్ పటీదార్ (18), గ్లెన్ మాక్స్‌వెల్ (3), అనుజ్ రావత్ (11) విఫలమయ్యారు. కోహ్లి నిష్క్రమణతో మ్యాచ్ పంజాబ్ కింగ్స్ వైపు మొగ్గింది. కానీ దినేశ్ కార్తీక్, మహిపాల్ లామ్రోర్ సూపర్ హిట్టింగ్‌ను బెంగళూర్‌కు విజయాన్ని కట్టబెట్టారు. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 176 పరుగులు చేసింది. కెప్టెన్ శిఖర్ ధావన్ (45, 37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), జితేశ్ శర్మ (27, 20 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు), శశాంక్ సింగ్ (21 నాటౌట్, 8 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు) రాణించారు. ఈ సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు ఇది తొలి విజయం కాగా, పంజాబ్ కింగ్స్‌కు ఇది తొలి పరాజయం.

శశాంక్ ధనాధన్ : సొంతగడ్డపై టాస్ నెగ్గిన బెంగళూర్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. పంజాబ్ కింగ్స్‌కు ఓపెనర్లు మరోసారి ఆశించిన ఆరంభం ఇవ్వలేదు. జానీ బెయిర్‌స్టో (8) నిరాశపరిచాడు. కెప్టెన్ శిఖర్ ధావన్ (45, 37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. ప్రభ సిమ్రన్ సింగ్ (25)తో కలిసి రెండో వికెట్‌కు 55 పరుగులు జోడించిన ధావన్ పంజాబ్ కింగ్స్‌కు మంచి స్కోరు అందించేలా కనిపించాడు. అర్థ సెంచరీ ముంగిట ధావన్ నిష్క్రమించగా.. లియాం లివింగ్‌స్టోన్ (7) ఓ సిక్సర్, ఫోర్‌తో సరిపెట్టాడు. 89/4తో పంజాబ్ కింగ్స్ స్వల్ప స్కోరుకు పరిమితం అయ్యేలా కనిపించింది. ఈ దశలో శామ్ కరన్ (23), జితేశ్ శర్మ (27) విలువైన భాగస్వామ్యం నమోదు చేశారు. ఈ ఇద్దరు ఐదో వికెట్‌కు 34 బంతుల్లో 52 పరుగులు జోడించారు. డెత్ ఓవర్లలో కరన్, జితేశ్ వికెట్ కోల్పోగా.. ముగింపు బాధ్యత శశాంక్ సింగ్ (21 నాటౌట్) తీసుకున్నాడు. రెండు సిక్సర్లు, ఓ ఫోర్‌తో 8 బంతుల్లోనే 21 పరుగులు పిండుకున్నాడు. దీంతో పంజాబ్ కింగ్స్ 176 పరుగులు చేసింది. బెంగళూర్ బౌలర్లలో మహ్మద్ సిరాజ్ (2/26), గ్లెన్ మాక్స్‌వెల్ (2/29) రాణించారు. అల్జారీ జోసెఫ్ ఆరంభంలో ఆకట్టుకున్నా.. చివర్లో పరుగుల నియంత్రణ కోల్పోయాడు. యశ్ ధయాల్ (1/23) సైతం ఆకట్టుకున్నాడు.

సంక్షిప్త స్కోరు వివరాలు :

పంజాబ్ కింగ్స్ : 176/6 (శిఖర్ ధావన్ 45, జితేశ్ శర్మ 27, మహ్మద్ సిరాజ్ 2/26, గ్లెన్ మాక్స్‌వెల్ 2/29)

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ : 178/6 (విరాట్ కోహ్లి 77, దినేశ్ కార్తీక్ 28, కగిసో రబాడ 2/23, హర్‌ప్రీత్ 2/13)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68